1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

బుధవారం | 03 జులై 2024 | www.navatelangana.com

రైతులకు అందుబాటులో ఉండి సూచనలు ఇవ్వాలి



అధికారులకు శాస్త్రవేత్తల సూచన

నవతెలంగాణ-గజ్వేల్

వర్షాకాలంలో రైతులు పండించే పంటలతో పాటు ఇతర రైతులు పండిస్తున్న పంటలపై పూర్తి అవగాహన కల్పించాలని స్థానిక వ్యవసాయ అధికారులకు శాస్త్రవేత్తలు సూచనలు సలహాలు ఇచ్చినట్లు గజ్వేల్ ఏడీఏ బాబు నాయక్ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్‌లోని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా గజ్వేల్ డివిజన్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఇందులో సమగ్ర వ్యవసాయం నుంచి వచ్చే లాభాలు రైతులకు వివరించాలని ఆదేశించినట్లు తెలిపారు. అంతేకాకుండా మేకలు, గొర్రెలు, పశువుల పెంపకం, సేంద్రియ వ్యవసాయం, పంటలో కలుపు నివారణ, అంతర్ పంటల సాగు విధానం పై అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. అంతేకాకుండా పురుగుమందుల యజమాన్యం, ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని, అధిక మోతాదులో పద్ధతులను అవగాహన కల్పించాలన్నారుఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏవోలు నాగరాజు, ప్రియదర్శిని, ఏఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 30లోగా కేటాయించిన బియ్యం ఇవ్వాలి



116 రైస్ మిల్లులకు నోటీసులు

నవ తెలంగాణ-సిద్దిపేట

సెప్టెంబర్ 30లోగా రైస్ మిల్లులకు కేటాయించిన బియ్యాన్ని ఇవ్వాలని, లేనియెడల చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనుజ అన్నారు. మంగళవారం 'నవ తెలంగాణ'తో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 116 రైస్ మిల్లులకు ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించిన బియ్యాన్ని ఇవ్వాలని ఈ మధ్యనే నోటీసులు ఇచ్చామని తెలిపారు. కొన్ని రైసు మిల్లుల వారు తమకు కేటాయించిన సీఎంఆర్ మిల్లింగ్ బియ్యాన్ని వెంటనే ఇస్తున్నారని, కానీ కొంతమంది సీఎంఆర్ మిల్లింగ్ బియ్యం ఇవ్వడంలేదన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం బ్లాక్ లీస్టులో పెట్టే అవకాశం ఉందని, రైస్ మిల్లుల యజమానులు వెంటనే తమకి ఇచ్చిన కోటాను పూర్తి చేసుకోవాలని కోరారు.

బోనస్ ఇస్తే....

- రైతులకు రూ.870 కోట్ల ఆదాయం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో దొడ్డు వడ్ల సాగే 80 శాతం
- సన్న రకాల పట్ల రైతుల్లో అనాసక్తి
- సన్నలకే ఇస్తే రూ.174 కోట్లే లబ్ధి
- ప్రతి గింజకూ బోనస్ ఇస్తామని ఎన్నికల్లో హామీ...
- అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్

జిల్లా	గత వానాకాలం	గత యాసంగీ	ప్రస్తుత వానాకాలం
సిద్దిపేట	300000	348000	320000
మెదక్	300967	185295	327000
సంగారెడ్డి	140000	103000	150000
మొత్తం	740967	636295	797000

జిల్లా	ఈ ఖరీఫ్ సాగు అంచనా ఎకరాలు	దిగుబడి అంచనా లక్షల క్వింటాళ్లలో	బోనస్ ఇస్తే రూ.500
సిద్దిపేట	300000	67.20	రూ.336 కోట్లు
మెదక్	327000	73.24	రూ.366.24 కోట్లు
సంగారెడ్డి	150000	33.60	రూ.168 కోట్లు
మొత్తం	777000	174.04	రూ.870,24 కోట్లు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వరి సాగు కత్తిమీది సాములా మారుతోంది. ఏటేటా ఏదో ఒక రకమైన సమస్య వచ్చి పడుతుంది. దొడ్డు రకం బియ్యాన్ని కొనుగోలు చేయబోమంటూ కేంద్రం ఎఫ్‌సీఐ ద్వారా కొర్రీలు పెట్టింది. దీంతో అప్పటి సీఎం కేసీఆర్ సైతం సన్నలు మాత్రమే సాగు చేయాలంటూ ఉకుం జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఏమో ప్రతి గింజకూ బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాకనేమో కేవలం సన్నలకు మాత్రమే బోనస్ ఇస్తామన్నారు. వరి పండించే రైతుల్ని ఇలా ఏదో ఒక సమస్య వెంటాడుతునే ఉంది. రైతులు పండించే అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తే మాత్రమే ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రూ.870.24 కోట్ల మేర లాభం చేకూరనుంది. కేవలం సన్నలకు మాత్రమే ఇస్తే రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో దొడ్డు రకం ధాన్యమే 80 శానికి పైగా సాగయ్యే అవకాశముంది. ఇప్పటికే రైతులు పోసిన నార్లు దొడ్డు రకమే అధికంగా ఉన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు కోసం రైతులు ఇప్పటికే నార్లు పోశారు. ప్రాజెక్టుల కింద నీటిని విడుదల చేయకపోవడంతో కాల్వ కింద వరి నాట్ల పనులు షురూ కాలేదు. బోర్లు, బావుల ఆధారంగా నార్లు పోసిన రైతులు మాత్రం నాట్ల పనులు ప్రారంభించారు. ఆశించిన మేరకు వర్షాలు పడకపోవడంతో నాట్ల పనులు ఊపందుకోలేదు. అయితే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టుల కింద సాగునీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో సింగూరు ప్రాజెక్టు, మెదక్‌లో ఘనపూర్ ఆనకట్ట, సిద్దిపేట జిల్లాలో మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచంసాగర్ ద్వారా సాగునీటిని విడుదల చేస్తే వరి పంట అంచనా మేరకు సాగయ్యే అవకాశాలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణాన్ని పరిశీలిస్తే...గత వానాకాలంలో 7,40,967 ఎకరాల్లో వరి సాగైంది. గత యాసంగీలో 6,36,395 ఎకరాల్లో సాగైంది. ఈ ఖరీఫ్‌లో మాత్రం 7,97,000 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటికే మూడు జిల్లాల్లోనూ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తున్నారు. వరి సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయి తప్ప మద్దతు ధరలు పెరగట్లేదు. కేంద్రం ఇటీవల నామమాత్రంగా ధాన్యానికి ధర పెంచింది. కేంద్రం పెంచే అరకొర ధర గిట్టుబాటు కాని పరిస్థితులున్నందున రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున ఖరీఫ్ సీజన్ నుంచైనా ధాన్యానికి బోనస్ ఇస్తారన్న ఆశతో రైతులున్నారు.

బోనస్ ఇస్తే ఉమ్మడి మెదక్ జిల్లాకు రూ.870 కోట్ల లాభం

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇస్తే ఉమ్మడి మెదక్ జిల్లాలోని రైతులకు ఎంతో మేలు చేకూరనుంది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అన్ని రకాలు అనే మాట మార్చి సన్నకలకు మాత్రమేనని చెప్పారు. రైతుల్లో తీవ్ర వ్యతిరేకత రాగానే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సీజన్‌లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మరో ప్రకటన చేసింది. దీంతో బోనస్‌పై రైతుల్లో ఆశలు పెరిగాయి. ఈ ఖరీఫ్‌లో మెదక్ జిల్లాలో 3,27113 ఎకరాల్లో వరి సాగుకానుంది. సిద్దిపేట జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో సంగారెడ్డి జిల్లాలో 150000 ఎకరాల్లో సాగవనుంది. ఎకరాలకు సగటున నాలుగు పుట్ల వడ్లు పండుతాయి. అంటే 22.4 కింటాళ్ల ధాన్యం దిగుబడులు వస్తాయి. ఈ లెక్కన మెదక్ జిల్లాలో 73.24 లక్షల క్వింటాళ్ల ధాన్యం పండనుంది. క్వింటాల్‌కు రూ.500 బోనస్ చొప్పున మెదక్ రైతులకు రూ.366.24 కోట్ల మేరకు ఆదాయం సమకూరనుంది. సిద్దిపేట జిల్లాలో సాగయ్యే వరి పంట ద్వారా 67.20 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రానుంది. ఇక్కడ కూడా రూ.336 కోట్ల బోనస్, సంగారెడ్డి జిల్లాలో 33.60 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులు రానున్నందున రూ.168 కోట్ల రూపాయలు బోనస్ రూపంలో ఆదాయం సమకూరనుంది. మూడు జిల్లాల్లో కలిపి రూ.870.24 కోట్ల ఆదాయం బోనస్ రూపంలో రైతులకు లబ్ధి చేకూరనుంది.

సన్నలకే పరిమితమైతే తీవ్ర నష్టం

సన్న రకం ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తే మాత్రం ఉమ్మడి మెదక్ జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోనున్నారు. మూడు జిల్లాల్లో వరి సాగు విస్తీర్ణంలో సన్న రకాలు కేవలం 20 శాతం మాత్రమే ఉండనుంది. మూడు జిల్లాల్లో కలిపి సన్న రకాలు 1.50 లక్షల ఎకరాల కంటే ఎక్కువ సాగయ్యే అవకాశంలేదు. పైగా సన్న రకాల సాగు వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా అనేక చీడలు ఆశించి దిగుబడి తగ్గుద్ది. రైతులు సన్నలు సాగు చేసేలా వ్యవసాయ శాక అవగహన కల్పించడంలేదు. సన్నలు సాగు చేసినా అందులో కొంత మేరకు రైతులు సొంత అవసరాలకు ఉంచుకుంటారు. మిగతాది స్థానికంగా మిల్లర్లు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తారు. మిల్లర్లు సన్న బియ్యం వ్యాపారం కోసం రైతుల నుంచి ధాన్యాన్ని ముందస్తు అడ్వాన్స్‌లు ఇచ్చి కొనుగోలు చేస్తారు. మిగతాది కొంత మేరకు మాత్రమే మార్కెట్‌కు వచ్చే అవకాశముంది. సన్న వడ్ల సాగు విస్తీర్ణాన్ని బట్టి మూడు జిల్లాల్లో కూడా రైతులకు కేవలం రూ.174 కోట్ల మేరకు బోనస్ రూపంలో ఆదాయం రానుంది. సన్న రకం వరి పంట కాలం ఆరు నెలలు కాగా దొడ్డు రకం 120 రోజులు మాత్రమే. జులై వరకు కూడా సరిపడ వర్షాలు పడనందున సన్నలు సాగు చేసేందుకు రైతులు వెనకాడుతున్నారు.

అన్ని రకాలకు బోనస్ ఇవ్వాలి

రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

రైతులు పండించే సన్న, దొడ్డు రకం అనే తేడా లేకుండా బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల్లో ధాన్యానికి బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడం వల్లనే రైతులు నమ్మి ఓట్లేశారు. అధికారంలోకి వచ్చాక సన్నలకు పరిమితం చేయడం సరికాదు. 80 శాతం రైతులు దొడ్డు రకం వడ్లను పండిస్తున్నందున అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలి. ఎరువులు, డీజిల్, పురుగుమందులు, లేబర్ ఛార్జీలు పెరుగుతున్నందున వరి సాగు పెట్టుబడులు భారంగా మారాయి. కేంద్రం క్వింటాల్ ధాన్యానికి కేవలం రూ.117 మాత్రమే ధర పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇచ్చి ఆదుకోవాలి.

గెస్ట్ ఫ్యాకల్టీకి ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయ పోస్టులకు ఆహ్వానాలు కోరుతున్నట్టు సాంఘిక సంక్షేమ మెదక్ వెస్ట్ రీజియన్ ప్రాంతీయ సంయుక్త అధికారి యం. భీమయ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 11, మెదక్ జిల్లాలో 4, ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లము, గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జీవ శాస్త్రములు, సాంఘిక, వాణిజ్య శాస్త్రము, వ్యాయామ, లైబ్రేరియన్, స్టాఫ్ నర్సుల పోస్టులకు తగు అర్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసకోవాలన్నారు. ఆసక్తి గల వారు బయోడేటా నకలు సర్టిఫికెట్‌లతో డెమో తరగతులకు ఈనెల 4న ఉదయం 10-00 గంటలకు ఇస్నాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలలో హాజరుకావాలని తెలిపారు.

భూ తగాదాలతో దారుణ హత్య

అన్నను హతమార్చిన తమ్ముడు



నవతెలంగాణ-న్యాల్‌కల్

భూతగాదాలతో సొంత అన్ననే తమ్ముడు హత్య చేశాడు. ఈ ఘోరమైన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల పరిధిలోని మల్గి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్గి గ్రామానికి చెందిన గొల్ల బాబు(53)కు అతని తమ్ముడు వైద్యనాథ్‌కు గత కొంతకాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రోజున మరోసారి గొడవ జరగ్గా.. బాబుపై తమ్ముడు వైద్యనాథ్ దాడి చేసి హతమార్చాడు. విషయం తెల్సుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ నహిమెద్దీన్, ఎస్సై రామునాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ ఎస్సై రామునాయుడు తెలిపారు.

క్రీడా ప్రాంగణాలన్నీ వినియోగంలోకి తేవాలి



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని క్రీడా ప్రాంగణాలన్నింటినీ వినియోగ ంలోకి తేవాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. మండల ంలోని మునిదేవునిపల్లి గ్రామ వెంచర్‌లో పంచాయతీ కార్యదర్శులకు రివ్యూ మీటింగ్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణాలు అన్నీ కూడా పూర్తిస్థాయి వాడకంలో రావాల్సిందిగా ఆదేశించారు. అన్ని గ్రామాల్లో కూడా ముని దేవునిపల్లి, మన్సన్‌పల్లి గ్రామంలో ఉన్న విధంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. అలాగే జిల్లా అధికారులు తీసుకున్న గూగుల్ మీట్‌లో తెలిపిన విషయాలు పీడీఐ గురించి పంచాయతీ కార్యదర్శులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఓ వీరప్ప, ఈజీఎస్ స్టాప్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-మద్దూరు

రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన, మద్దూరు మండలంలోని వల్లంపట్ల, గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ముస్త్యాల రవి, తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి బైక్ పై జనగామ జిల్లా నర్మెట్ట మండల కేంద్రంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా. నర్మట, అమ్మాపూర్, గ్రామాల మధ్య ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొట్టడంతో రవితో పాటు ఆయన భార్య కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన భార్య భర్తలను స్థానికులు జనగామ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వంటిమామిడి లోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ ఈఓ సాంబయ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇంటి పరిసరాల్లోని తొట్లలో నీరు నిల్వ ఉంచుకోరాదని , దీనివల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయని తెలియజేశారు. కాబట్టి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. అనంతరం డెంగ్యూ పాజిటివ్ వచ్చినటువంటి వ్యక్తులను కలిసి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ కనకయ్య, హెచ్ ఏ రవీందర్ రెడ్డి, కొమురయ్య, అనిల్, ఏఎన్ఎం సుజాత, ఆశాలు శారద, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకై జులై 7న దీక్ష




నవతెలంగాణ-తూప్రాన్

ఎస్సీ వర్గీకరణ సాధనకై జులై 7న చేపట్టిన దీక్షను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. వర్గీకరణ సాధనే లక్ష్యంగా వంగపల్లి శ్రీనివాస్ చేపట్టిన దీక్ష కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతర వారు మాట్లాడతూ జూలై 7న %వీక్మూరా యా% ఉద్యమం పుట్టి 30సంవత్సరాలు అయిన సందర్భంగా వర్గీకరణపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఇక కేంద్ర ప్రభుత్వంపై యుద్ధమే లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్షకు శ్రీకారం చుట్టారన్నారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జూలై 7న జరిగే దీక్ష ని అన్ని కుల సంఘాలు,విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు,ప్రజా సంఘాలు,రాజకీయ పార్టీలకు అతీతంగా మద్దతు ఇచ్చి దీక్షను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలసాయి హరిప్రసాద్,చీమల బిక్షపతి, దాతర్ పల్లి రామకృష్,తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచాలి

డీఐఈఓ హిమబిందు



నవ తెలంగాణ-సిద్దిపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి హిమబిందు ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్న ప్రిన్సిపల్ లను, లెక్చరర్ లను కోరారు. డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రిన్సిపల్స్, అధ్యాపకులు సమిష్టి కృషితో పనిచేసి ఇంటర్ విద్యలో జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంతవరకు వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు. అధ్యాపకులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. ఇంటర్ విద్య బలోపేతానికి అందరం కలిసికట్టుగా పని చేయాలని, అందుకోసం తన వంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



నవ తెలంగాణ - సిద్దిపేట : నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ నిరుద్యోగులను విస్మరిస్తుందని బీజేవై ఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ విమర్శించారు. పార్టీ పిలుపు మేరకు నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిద్దిపేటలో ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన తెలిపి, తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శులు సలెంద్రి రాజు, చేపూరి విజయ్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి కళ్యాణ్ దాస్, నవీన్ రెడ్డీ, అధికార ప్రతినిధులు మల్లం శ్రీనివాస్, తిరుమలేష్ గౌడ్, నాయకులు కృష్ణ, యాదవ్ రావు, శంకర్, రిషి, అనీష్, రాహుల్, సంతోష్ గౌడ్, లీతిన్, కార్తీక్, వినయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ... భావోద్వేగానికి గురైన విద్యార్థులు





నవతెలంగాణ-రాయపోల్

గురువుకు విద్యార్థులకు ఉన్న అనుబంధం విడదీయరానిదని విద్యాబుద్ధులు నేర్పి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి గురువులే కారణం. అలాంటి గురువు పాఠశాల నుంచి బదిలీపై వెళుతుంటే తట్టుకోలేని విద్యార్థులు సారూ... మమ్మల్ని, మా పాఠశాలను విడిచి వెళ్లొద్దంటూ కన్నీటి పర్యంతమయ్యారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో ఆరేళ్లుగా విధులు నిర్వహించిన తెలుగు ఉపాధ్యాయులు యన్.శ్రీనివాస్ బదిలీపై అక్కన్నపేట మండలం మోత్కులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లారు. మంగళవారం పాఠశాల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీనివాస్ చుట్టూచేరి సారూ మీరు వెళ్లొద్దంటూ కంటతడి పెట్టుకున్నారు. విద్యార్థుల రోదనలతో ఉపాధ్యాయుడు సైతం భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు బోధించడంతోపాటు వినయం, క్రమశిక్షణ జీవితంలో ఉన్నత స్థాయికి ఎన్నో సూచనలు చేస్తుండేవారు. అలాంటి ఉపాధ్యాయుడు బదిలీ కావడం విద్యార్థులు తట్టుకోలేకపోతున్నారు. పాఠశాల అభివృద్ధికి కూడా ఆయన వంతు కృషి చేశారని గ్రామస్థులు కొనియాడారు.

నవ తెలంగాణ - సిద్దిపేట

ఉపాధ్యాయురాలు బదిలీ అయి వెళ్తున్న క్రమంలో విద్యార్థులు భావోద్వేగానికి గురై బోరున విలపించిన ఘటన పట్టణంలోని కాళ్ల కుంట కాలనీ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న జయశ్రీ బదిలీపై వెళ్తుండగా, గత కొన్ని సంవత్సరాల నుంచి తమకు విద్యా, బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలు బదిలీపై వెళ్తున్నారని, విద్యార్థులు ఒక్కసారిగా ఆమెను పట్టుకొని బోరున విలపించారు. ఉపాధ్యాయురాలు కూడా విద్యార్థుల భావోద్వేగాన్ని చూసి ఆమె కూడా కండ్లకు నీళ్ల తెచ్చుకుని, కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులను ఓదార్చారు. గురువుకు శిష్యులకు మధ్య ఉన్న బంధానికి నిదర్శనం ఈ ఘటన.

రేపటి బంద్‌ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రేపు(గురువారం) జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్ పై, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి.. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలన్నారు. ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేయాలన్నారు. నీట్ విద్యార్థుల పట్ల ఎన్డీఏ ప్రభుత్వ వైఖరినీ నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రేపు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారని.. జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పరీక్ష కుంభకోణానికి బాధ్యత వహిస్తూ వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పజెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీఐఎస్ఎస్ ముంబయి. ఐఐటి ముంబై నుండి హైదరాబాద్ నుంచి ఇప్పటివరకు విద్యార్థి సంఘా నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, యూనివర్సిటీలలో స్వేచ్ఛ , ప్రజాస్వామ్యం అణిచివేత చర్యలు ఆపాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు లేరని పాఠశాల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని వారు డిమాండ్ చేశారు. 4న జరిగే బందును విజయ వంతంకై పాఠశాలల కళాశాల యజమాన్యం సహకరించి స్వచ్ఛందంగా బంద్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్, జిల్లా సహాయ కార్యదర్శి వాణి, నాయకులు రవి, కిరణ్, హరిప్రభ తదితలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుల ప్రతిపాదనలను ఆమోదిస్తాం



- **మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్**

నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవనిచోట మాజీ ఎమ్మెల్యేలు, ఆ జిల్లాకు సంబంధించిన డీసీసీ అధ్యక్షులు ఏదైతే ప్రతిపాదిస్తారో నామినేటెడ్ పదవుల్లో అదే అమలు చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి వర్గం చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు హైదరాబాదులో మంత్రి నివాసంలో ఆయనను కలిసి నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి జిల్లా అధ్యక్షుడు సూచించిన మేరకే ఆ జిల్లా పరిధిలో పదవులుగాని, ఇతర ఆ జిల్లా పరిధిలో నామినేటెడ్ పదవులు, అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయని గజ్వేల్ నాయకులకు మంత్రి భరోసా ఇచ్చారు. ఇందులో ఎవరు జోక్యం చేసుకోకూడదన్నారు. గజ్వేల్‌లో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కార్యకర్తలు నాయకులకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో కార్యకర్తలందరూ ఒకతాటిపై ఉండి అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. పార్టీలో గ్రూపులు కడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారి అందరికీ దశలవారిగా పదవులు దక్కుతాయని, వీటి కోసం పైరవీలు చేయకూడదన్నారు. గాంధీభవన్, ఢిల్లీ గాంధీభవన్ చుట్టూ తిరిగినంత మాత్రాన పదవులు రావని నాయకులు తెలుసుకోవాలన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని వారి సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరగవలసిన అభివృద్ధిపై చర్చించాలని ఆయన సూచించారు. పార్టీ బలోపేతంపై దృష్టి సారించి పార్టీ కోసం కష్టపడ్డ వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి పదవులు ఇస్తారని ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, రాష్ట్ర నాయకులు సర్దార్ ఖాన్, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మండల నాయకులు నరేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లేశం, సుభాష్ చంద్రబోస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



- **ఎమ్మెల్యే సునీత రెడ్డి**

నవతెలంగాణ-కౌడిపల్లి

రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా యువతకు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తిమ్మాపూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ఎనిమిది రోజులుగా నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గాంధీ ఆసుపత్రిలో దీక్ష చేస్తున్న నిరుద్యోగులకు జేఏసీ నాయకుడు మోతిలాల్ నాయక్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి సంఘీభావం తెలుపుతుందని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. తెలంగాణ యువత కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో బుద్ధి చెబుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష 60వేల ఉద్యోగాలు కల్పించామని, ఎన్నికలకు ముందు 27 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎన్నికల కోడ్ రావడంతో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 27 వేల ఉద్యోగాలు మేమే ఇచ్చామని అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ యువతను జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మోతిలాల్ దీక్షా శిబిరానికి మద్దతుగా వెళ్లిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజు, జెడ్పీటీసీ కవిత, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీటీసీ సారా స్వప్న కిషోర్ గౌడ్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సారా రామాగౌడ్, పోల నవీన్, మహిపాల్ రెడ్డి, ఎల్లం, మాజీ సర్పంచ్ పద్మ కిష్టయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సార ప్రతాప్ గౌడ్, నాయకులు ఉన్నారు.

రైతుల సూచనల మేరకే రైతు భరోసా



జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్

నవతెలంగాణ -కౌడిపల్లి

రైతుల సూచనలు సలహాల మేరకే రైతు భరోసా కొనసాగుతుందని జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహమ్మద్ నగర్ సొసైటీ ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమం కౌడిపల్లి రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయడానికి రైతుల అభిప్రాయాలు తీసుకోవడానికి సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని సూచించింది అన్నారు. అందులో భాగంగానే రైతు భరోసా 2018-2019 ఖరీఫ్ సీజన్ నుంచి రైతుబంధు గత ప్రభుత్వం పంట సాయం కోసం ప్రవేశపెట్టిందని , కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల అభిప్రాయం మేరకు రైతు భరోసా ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతుల సూచనలు సలహాలు మేరకు సాగుభూములకే రైతు బంధు ఇవ్వాలని, ఐదు ఎకరాల లోపు రైతు బంధు ఇవ్వాలంటూ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతుల సూచనలు సలహాలు పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, ఏవో స్వప్న, దుర్గా రెడ్డి, శివాంజనేయులు, సొసైటీ సీఈవో దుర్గా గౌడ్, సుధాకర్, విష్ణుతో పాటు 11 మంది డైరెక్టర్లు,రాయగిరి, పోచయ్య, రమేష్ గుప్తా నర్సింలు రామయ్య బాలమణి రైతులు బోయిని వీరయ్య,బురిగారి కృష్ణ, బాలా గౌడ్ ఏఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతర పోరాటం



సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

నవతెలంగాణ-కొమురవెల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) నిరంతర పోరాటాలు చేస్తుందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో జరిగిన సీపీఐ (ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు సహకరించిన మండల ప్రజలకు, దాతలకు సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం చేస్తుందని, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) చేసే ఉద్యమాలలో మీరంతా భాగస్వాములై సీపీఐ (ఎం) ఉద్యమాలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, అత్తిని శారద, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, నీల శీను, బక్కెళ్ళి బాలకిషన్, సార్ల యాదయ్య, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లాపూర్‌లో రైతు భరోసా పథకంపై అవగాహన



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రైతు వేదికలో రైతు భరోసా పథకంపై మంగళవారం 'ప్రత్యేక మహాజన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి తుమ్మల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుండి అభిప్రాయాలను సేకరించారు. వ్యవసాయ పనిముట్లు, గేదలు, ఆవులు, మేకలు, కోళ్ల పెంపకానికి ప్రభుత్వం నుండి 75శాతం సబ్సిడీ ఇవ్వాలని రైతులు కోరారు. రైతు భరోసా డబ్బును సకాలంలో చెల్లించాలని పలువురు అడిగారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ మధు, డైరెక్టర్లు సునీల్, మోహన్ రెడ్డి, రామకృష్ణ, శ్రీహరి మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా పై అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-కొండాపూర్

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కోసం మండల పరిధిలోని మల్కాపూర్ రైతు వేదికలో పవన్ అధ్యక్షతన, ఉపాధ్యక్షులు మాణిక్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. గతంలో గుట్టలు, కొండలు, వెంచర్లు వ్యవసాయేతర భూములకు రైతు బంధు ఇచ్చారన్న ఆరోపణలు వచ్చాయ న్నారు. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వ ఆదేశాలతో రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నట్టు చెప్పారు. వారి సూచనలు, సలహాల మేరకే పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీబీ బ్యాంక్ మెదక్ ఓఎస్డీ శ్రీధర్, కోపరేటివ్ సీనియర్ ఇన్స్పెక్టర్ కవిత, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ గణేష్, సీఈఓ మధుసూదన్ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు అత్నూర్ పంచాయతీ భవనం ప్రారంభోత్సవం

ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని అత్నూర గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం నేడు(బుధవారం) జరగనున్నదని. జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కర్, స్థానిక ఎమ్మెల్యే మాణిక్ రావు ముఖ్య అతిథులుగా హాజరై.. ఈ భవనాన్ని ప్రారంభిస్తారని ఎంపీడీవో సురేష్ తెలిపారు. కాగా ఆయా పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ గౌసోద్దిన్ పిలుపునిచ్చారు.

ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం

అర్హత లేని డిగ్రీలతో.. ఆర్ఎంపీ డాక్టర్లు మంటూ చలామణి



నవతెలంగాణ-సదాశివపేట

అర్హత లేకుండా ఎవరు వైద్యం చేయకూడదని వైద్య ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించింది. కానీ సదాశివపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో నార్త్ ఇండియాకు సంబంధించిన కొందరు అర్హతలేని డిగ్రీ సర్టిఫికేట్లు పట్టుకుని డాక్టర్ల మంటూ చలామణి అవుతున్నారు. ప్రజలకు ఎక్కువ డోస్ గల ట్యాబ్లెట్లు, స్టెరాయిడ్స్, యాంటీబయటిక్, ఇంజక్షన్లు గ్లూకోజ్ ఎక్కించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. తమకంటూ ఒక వ్యవస్థని తయారు చేసుకుని మండల పరిధిలో ఏ ప్రభుత్వాన్ని ఆసుపత్రికి వెళ్ళనివ్వకుండా డాక్టర్ల ముసుగులో రోగులకు వైద్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి.. ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుకు ఉద్యమం ఉధృతం

సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్..

పలు పరిశ్రమల వద్ద సంతకాల సేకరణ



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ప్రాంతం రోజు రోజుకూ అభివృద్ధి చెందుతుందని.. ప్రత్యేకించి పరిశ్రమలు, కార్మిక వర్గం పెరుగుతున్నందున ఇక్కడ కనీసం 50పడల ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని సీఐటీయూ క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అ ల్ఫ్, ముంగి, మంగ్ల ట్యూబ్ పరిశ్రమ వద్ద సంతకల సేకరణ చేపట్టారు. ఈ సం దర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో సుమారుగా మూడువేల మంది ఈఎస్ఐ కార్డు హోల్డర్స్ ఉండి.. సుమారుగా రూ.23 నుంచి 25 లక్షలు ఈఎస్ఐ బోర్డుకు వెళుతున్నాయన్నారు. కనీస సౌకర్యాలు కూడా ఇక్కడ ఎన్న ఎసఎల్ డిస్పెన్సరీలో లేవని.. అందుకే 50 పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయా లని డిమాండ్ చేశారు. హాస్పటల్ ఏర్పాటు అయ్యే వరకూ పోరాడుతామన్నారు. సీఐటీయూ నాయకులు సందీపరెడ్డి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లకు సన్మానం



నవతెలంగాణ-సంగారెడ్డి

వైద్య వృత్తిలో ప్రముఖ సేవలందిస్తున్న డాక్టర్ రాజు గౌడ్, డాక్టర్ సత్యనారా యణ, డాక్టర్ ప్రభాకర్‌ను వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి సభ్యులందరూ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్లు మాట్లాడుతూ.. వైద్య వృత్తి అన్ని వృత్తిలో కెల్లా పవిత్రమైనదన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోగుల ప్రాణాలను కాపాడడంలో వైద్యులు ఎల్లవేళలా ముందఁంటారన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి ఆధ్వర్యంలో భవిష్యత్‌లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంలో తమ వంతు సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రోటరీ సభ్యులు పూసల లింగ గౌడ్, చవాన్ సత్యనారాయణ, పాండురంగల్ సేట్, దశరథ్, రాంగారి శ్రీనివాస్, ఏ.కిషన్, ఎం.నాగిరెడ్డి, భూమయ్య, అడ్వకేట్ అంజయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కోనేటి చంధర్, వెంకట్ గౌడ్, కమలాకర్ పాల్గొన్నారు.

త్వరలో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయం



నవతెలంగాణ-పుల్కల్

బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాం"న్నారని.. అతి త్వరలోనే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని డీసీసీబీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ చంద్రారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేండ్లు రాష్ట్రా న్ని పాలించిన కేసీఆర్ తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నద న్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆందోల్ నియోజకవ ర్గం పట్ల ప్రత్యే క శ్రద్ధ వహించి ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నార న్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు మంత్రి పట్ల అసభ్యంగా ప్రవరిస్తు న్నా రని..ఇది సరికాదన్నారు. పార్టీలకతీతంగాప్రజా సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

గురుకుల కళాశాలను సందర్శించిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల కళాశాలను తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జుబేద బేగం, మేనేజర్ జనార్ధన్‌రెడ్డి, సంగారెడ్డి డీఎమ్‌డబ్ల్యూఓ దేవుజ, కమీషన్ సభ్యులు తదితరులు మంగళవారం పరిశీలించారు. కళాశాల క్యాంపస్‌లో గల కామన్ సర్వీస్ సెంటర్‌ను పరిశీలించి అందులో ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాల ఏర్పాటు గురించి సభ్యులతో చర్చించారు. మైనార్టీ కళాశాల పని తీరును , వసతులను చూసి సంతృప్తిని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జే.రాములు, కే.యస్. జమీల్ , డిప్యూటీ వార్డెన్ సమీయుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన

నవతెలంగాణ-మునిపల్లి

మండల కేంద్రమైన మునిపల్లి మోడల్ స్కూల్‌లో నూతన జాతీయ విద్యా విధానంపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లలితాకుమారి హాజరై మాట్లాడారు. అంగన్వాడీ పిల్లలకు నాణ్యతతో కూడిన విద్య అందించడానికి కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పూర్వ ప్రాథమిక సంరక్షణకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు చేశారన్నారు. అందుకుఆ ప్రకారం విద్యా బోధన అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు.

జెడ్పీ నిధులతో బోరు బావి పనులు ప్రారంభం

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని ఖమ్మం పల్లి గ్రామంలో జెడ్పీటీసీ నిధులతో బోరు బావి పనులను స్థానిక జడ్పీటీసీ పైతర మీనాక్షి సాయికుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో గత ఐదేండ్ల పాటు మండలాభివృద్ధికి తోడ్పాటునందించామ న్నారు. అందుకు సహకరించిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ సాయికుమార్, నాయకులు మాణయ్య, ఫారుఖ్ పటేల్, దుర్గయ్య, నరేష్, సుభాష్, వేంకటేశం, శ్రవణ్, సురేష్, జనార్దన్, మల్లేశం, వీరేశం, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్..

సుమారు రూ.3 లక్షల విలువ గల 72 మాడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంసం

- సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ కేసులు
- ప్రజలు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

ఆకతాయిలు ఆగడాలకు చెక్ పెడుతూ.. సుమారు 3 లక్షల విలువ గల 72 మాడిఫైడ్ సైలెన్సర్లను పోలీసులు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టరేట్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో జిల్లా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ.. ద్విచక వాహనదారులు సైలెన్సర్ మాడిఫై చేసి పెద్ద శబ్దాలతో సౌండ్‌పొల్యూషన్ చేస్తూ, సామాన్య ప్రజానికాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి వాహనదారులను గుర్తించడం కోసం సంగారెడ్డి ట్రాఫిక్ పోలీసులు గత వారం రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా మాడిఫైడ్ సైలెన్సర్లు గల 72 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటి నుంచి సైలెన్సర్స్ తీసివేయించి కలెక్టరేట్ ఎదురుగా మంగళవారం రోజున రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేసినట్టు చెప్పారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని, సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు సైలెన్సర్ మాడిఫై చేసిన మెకానిక్‌లపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తే.. ఆ వాహనదారుల లైసెన్సు రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనదారులు కంపెనీ-సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై సంగారెడ్డి జిల్లా ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణానికి సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖ వివిధ రకాల ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, అందులో భాగంగానే ట్రాఫిక్ సిగ్నల్స్, యు-టర్న్లు ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి నాకాబందీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం, ఉదయం, సాయంత్రం స్కూల్/కళాశాల బస్సు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసే పోలీస్ శాఖకు మీ వంతు సహాయ సహ కారాలు ఉండాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుమన్, సంగారెడ్డి-టౌన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సంగారెడ్డిరూరల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





త్వరగతిన యూనిఫాంలు అందజేయాలి

నవతెలంగాణ-జోగిపేట

విద్యార్థులకు త్వరగతిన యూనిఫాంలు అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. జోగిపేటలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫామ్ తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మహిళా సంఘాలు వీలైనంత త్వరగా అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేసి ఆయా పాఠశాలలకు అందించాలని సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. జోగిపేట మెప్మా ఆధ్వర్యంలో సుమారుగా 2000 విద్యార్థులకు యూనిఫాంలు తయారుచేసేందుకు పనులు జరుగుతున్నాయని ఆయనకు వివరించారు. ఆర్డీఓ పాండు, కమిషనర్ తిరుపతి, మెప్మా కోఆర్డినేటర్ బిక్షపతి ఉన్నారు.



రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-సంగారెడ్డి

రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గోపన్న గారి చంద్రశేఖర్, కార్యదర్శిగా నక్క రమేష్ , కోశాధికారిగా సిహెచ్. అంజయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ సేవలు మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా సంగారెడ్డి సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

విషం చిమ్ముతున్న షుగర్ ఫ్యాక్టరీ

- పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

నవతెలంగాణ-పుల్కల్

చౌటకూర్ మండల పరిధిలోని పోసాన్‌పల్లి గ్రామ శివారులో గత రెండేండ్ల క్రితం నిర్మించిన గణపతి షుగర్ లిక్విడ్ పరిశ్రమ ఇష్టానుసారంగా కాలుష్యం విడుదల చేస్తుండడంతో.. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య కారకాలతో పొలాలన్నీ బీడులుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశ్రమకు ఎలాంటి అనుమతులు లేనప్పటికీ గత ప్రభుత్వంలో ఈ పరిశ్రమను నిర్మించారని పలువురు ఆరోపిస్తున్నారు. సంగారెడ్డి పట్టణ సమీపంలోని పసల్వాది గ్రామం వద్ద ఉన్న గణపతి షుగర్ ఫ్యాక్టరీ నుంచి చెరుకు రసాయన పదార్థాలు.. ఇక్కడ ఉన్న నూతన ప్లాంట్‌కు తరలిస్తున్నారన్నారు. ఇక్కడే చెరుకు పిప్పి ద్వారా లిక్విడ్ తయారు చేస్తున్నారని.. దానివల్ల విడుదల అయ్యే కాలుష్యం చుట్టుపక్కల రైతుల పొలాల్లోకి చేరుతున్నదన్నారు. తద్వారా రైతులు ఏ పంట వేసినా..పండట్లేద న్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఏ ఒక్క అధికారి స్పందించిన పాపాన పోలేదన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఈ ప్లాంట్, యజమాన్యం పై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. లేనియెడల రైతులమంతా ఏకమై కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.





కాలుష్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం



ఈ పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వల్ల పంట మొత్తం నాశనం అవుతుంది. మూగజీవులు సైతం కాలుష్య నీటిని తాగి అనారోగ్యాల బారిన పడుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి.. తయారు చేసిన లిక్విడ్‌ను ఇతర దేశాలకు తరలిస్తున్నారు. పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం వల్ల మేము చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే స్థానిక మంత్రి స్పందించిహీ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి.

- జర సతీష్, రైతు, ముమ్మారెడ్డి గూడెం

కలెక్టరేట్ ఎదుట నేటి ధర్నాను జయప్రదం చేయాలి

- ఎన్పీఆర్డీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు మల్లేశం

నవతెలంగాణ-జోగిపేట

వికలాంగుల సమస్యల పరిష్కారానికి నేడు(బుధవారం) కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు టి. మల్లేశం పిలుపునిచ్చారు. జోగిపేటలో స్థానిక విలేకర్లతో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గంలో వికలాంగులు ఎదురుకుంటున్న సమస్యలపై పలు తీర్మానాలు చేసినట్టు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో 5శాతం అమలు చేయాలని, నియోజకవర్గం కేంద్రంలో 1000 గజాల స్థలం కేటాయించి వికలాంగుల భవనం నిర్మించాలన్నారు. జోగిపేట మున్సిపల్ మరియు మండల కేంద్రాలు, మార్కెట్ యార్డ్‌లలో ఉన్న షేటర్స్ లలో 5శాతం వికలాంగులకు కేటాయించాలని, నియోజకవర్గం కేంద్రంలో స్వయం ఉపాధి కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ మండల కేంద్రంలో భవిత సెంటర్స్ ఏర్పాటు చేసి ఉచితంగా ఫిజియోతెరఫి చేయాలని, ప్రైవేట్ పాఠశాలలో వికలాంగుల పిల్లలకు 5శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలన్నారు.నియోజకవర్గంలో ఉన్న ప్రయివేట్ పరిశ్రమల్లో అర్హత కలిగిన వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే పలు విషయాలపై తీర్మానం చేశామన్నారు. ఈ తీర్మానల సాధనకు ఉద్యమాలు చేస్తామని తెలిపారు.



అందోల్ డివిజన్ కమిటీ ఎన్నిక..

గౌరవ అధ్యక్షులుగా టి మల్లేశం, అధ్యక్షులుగా డాక్టర్ సుభాష్, ఉపాధ్యక్షులుగా సిహెచ్. నాగయ్య, జి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా యం రాంచందర్, సహాయ కార్యదర్శులుగా కె.కృపావర్మ, రమాదేవి, సిహెచ్. నర్సిములు, కమిటీ సభ్యులుగా యదులు, జయమ్మ, చెన్నయ్య, యాదగిరి, వీరేశం, గణేష్, అబేద్, ఉస్మాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు.

ప్రజా నాయకులకు పదోన్నతులే.. విరమణలు ఉండవు

నవతెలంగాణ-జహీరాబాద్

రాజకీయ నాయకులకు పదవీ విరమణలు ఉండవని.. పదోన్నతులు మాత్రమే ఉంటాయని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఎంపీటీసీ, సర్పంచుల వీడుక్కోలు సమావేశానికి ఎంపీపీ, గిరిధర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పదవీ కాలంలో ప్రజలకు సేవ చేసిన నాయకుడు.. ఎల్లవేళలా ఉన్నత పదవుల్లో నిలుస్తారన్నారు. ఎంపీపీ గిరిధర్ రెడ్డి బీఆర్ఎస్ పాలనను ఎదుర్కొని.. జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డాడన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే.. సినిమా ఆటోగ్రాఫీ చైర్మెన్‌గా నియమించినట్టు చెప్పారు. పార్టీ సంక్షేమానికి కృషి చేసేవారికి.. పార్టీ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎంపీపీ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. తాను గత ఐదేండ్ల పాలనలో ఎన్నో కష్టాలు పడినా.. జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల్లో మండలాధ్యక్షులను గెలిపించుకోవడంతోపాటు పార్టీ అభివృద్ధికి కృషి చేశానన్నారు. సహకరించినటువంటి అధికారులకు ఎంపీటీసీలకు, సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో అనుకున్న స్థాయిలో నిధులు రాకపోవడంతో పలు గ్రామాల్లో అభివృద్ధి చేయలేకపోయామన్నారు. కానీ ప్రస్తుత తమ ప్రభుత్వంలో గ్రామాలన్నింటిని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామన్నారు. ఇందుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మరింత మద్దతుగా నిలవాలన్నారు. పదవీ కాలం ముగిసిన తమనందరినీ పిలిచి సన్మానించడం పట్ల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు జగన్మోహన్, నరసింహారెడ్డి, రాజు, మైనుద్దీన్ తదితరులు గిరిధర్‌రెడ్డిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్లు పాండురంగారెడ్డి, జ్యోతి, మోహన్, ఎంపీపీ ఉపాధ్యక్షులు రాములు, జడ్పీటీసీ నాగిశెట్టి, ఎంపీఓ మహేష్, ఆర్‌అండ్‌బి నర్సింలు, పంచాయతీరాజ్ ఏఈ కోటేశ్వరరావు, ఏవో ప్రవీణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, ఎంఈఓ బసవరాజ్, పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శుక్లవర్ధన్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, రంగ అరుణ్ కుమార్, అల్గోల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా



నవతెలంగాణ-అమీన్‌పూర్

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీకి మంచినీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన విధంగా ప్రతీ కాలనీకి మంచి నీటిని విడుదల చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో ఐదు భారీ రిజర్వాయర్లు నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. నూతన కాలనీలకు సైతం మంచినీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసున్నామన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆర్ఓ వెంకట్రామయ్య, హెచ్ఎండ బ్ల్యూఎస్ జీఎంనారాయణ, ఏఈఅమిరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల పట్ల హర్షం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉన్న కేసులన్నింటిని పక్కకు పెట్టి.. విజయవంతంగా బదిలీలు, పదోన్నతులు నిర్వహించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్టీయూ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బదిలీ ఖాళీలు ఏర్పడుతున్నాయని.. వెంటనే వాలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి ఆ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ రహమాన్, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, గవర్నమెంట్ హై స్కూల్ రంజోల్ జహీరాబాద్ మండలం పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ జీవితాన్ని నూరుశాతం పిల్లల సర్వతోముఖ అభివృద్ధికి త్యాగం చేసిన మహెూన్నత ఉపాధ్యా యులు రహమాన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శిలు హఫీ స్, జీవన్ రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీ రమణ కుమార్, మునిపల్లి మండలాధ్యక్షులు ఖయ్యూం ,జైరాబాద్ మండలాధ్యక్షులు షకీల్, సముద్రం ఖాదిరి, సోహైల్ ,సమీ ,సమద్, అఖిల్ మహమ్మద్, జాఫర్, రాజ్‌కుమార్ ,ప్రశాంత్, కాశీరాం, ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని ఆత్మకూర్ నుంచి ఏటిగడ్డసంగెం మీదుగా మాలపాడ్ గ్రామం వరకు పూర్తిగా ధ్వంసమైన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఎంపీడీఓ లేకపోవడంతో ఎంపీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. ఆత్మకూరు నుంచి ఏటిగడ్డసంగెం మీదుగా మాలపాడు గ్రామం వరకు ఉన్న రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రానికి ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగించాల్సి ఉండడంతో.. స్థానికులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రోడ్డు ధ్వంసమై పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో.. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ఆయా గ్రామాలకు బస్సు కూడా రావడం లేదన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా రాలేని దుస్థితి నెలకొన్నదన్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి.. ఆత్మకూరు నుండి ఏటిగడ్డ సంఘం మీదుగా మాల పహాడ్ గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ నిరసనలో డీవైఎఫ్ఐ గ్రామకమీట్ యువకులు నాగరాజు, అనందు ప్రశాంత మాణిక్యం నర్సింలు దుర్గరాజు నరేష్ హరికృష్ణ పాపయ్య షకీల్ అనిల్, మల్లేశం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముదిరాజ్ కులానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలి



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ కులానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పొలిట్ బ్యూరో సభ్యులు బానిస నారాయణ ముదిరాజ్ తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి ముదిరాజ్ కులానికి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా శ్రీహరి గెలుపొందారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులకు మంత్రివర్గంలో కచ్చితంగా చోటు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం క్యాబినెట్ విస్తరణలో ఆ హామీని నిలబట్టుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ముదిరాజు కులస్తులు కాంగ్రెస్ పార్టీకి విశ్వాసంగా ఉంటూ, గత అసెంబ్లీ, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ముదిరాజ్ ఎమ్మెల్యేకు స్థానం కల్పిస్తే యావత్ ముదిరాజ్ కులస్తులు కాంగ్రెస్ పార్టీవెంట ఉంటారన్నారు. క్యాబినెట్లో చోటు కల్పించకపోతే మాత్రం రాబోవు మున్సిపల్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ అధిష్టానం వర్గం, సీఎం రేవంత్ రెడ్డి ఈ విష యంలో చర్యలు తీసుకొని మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు.

ఈనెల 4న గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లాలో 11, మెదక్ జిల్లాలో 4 తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలు, కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయ పోస్టులు స్కూలు, కళాశాలలో ఖాళీగా ఉన్నాయని.. ఈనెల 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలల మెదక్ వెస్ట్ రీజియన్ ప్రాంతీయ సంయుక్త అధికారి ఎం.భీమయ్య తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లము, గణితము, భౌతిక, రసాయన, వృక్ష, జీవ శాస్త్రములు, సాంఘిక, వాణిజ్య శాస్త్రము, వ్యాయామ, లైబ్రేరియన్, స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. తగు అర్హతలు కలిగిన వారు తమ బయోడేటా నకలు సర్టిఫికెట్‌లతో డెమో తరగతులకు నాలుగో రోజున ఉదయం 10 గంటలకు ఇస్నాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలలో హాజరుకావాలన్నారు.

ఘనంగా జోగిపేట ఎస్ఐ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మంగళవారం జోగిపేట పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. అక్సానిపల్లి పీఏసీఎస్ చైర్మెన్ జి.నరేందర్ రెడ్డి, డాకూర్ మాజీ ఎంపీటీసీ కలాలి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు పోలీస్ సేవలను మరింతగా విస్తరింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సంజీవయ్య, సురేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐ రంగకృష్ణను కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రంగకృష్ణను బీజేపీ నాయకులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కలిశారు. సీఐను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జానకిరామ్ గౌడ్ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె సాయి ముదిరాజ్, పట్టణ ఉపాధ్యక్షులు పోతరాజ్ నాగరాజ్, సాయిబాబా యాదవ్, కార్యదర్శి శరత్, సంపత్, సోషల్ మీడియా విభాగం వినయ్, నాయకులు వెంగళి నవీన్, పిట్ల వంశీ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఐమాక్స్ లైట్లను మంగళవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఎంపీపీ నిధుల నుంచి మంజూరు చేసిన నిధులతో రెడ్డిపల్లి గ్రామంలో ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి ఎంపిటిసి శంభుని రవి, మాజీ ఉపసర్పంచ్ నర్సింలు, బాలరాజు, రాములు, రవి, నజీర్, బాలయ్య, స్వామి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బోడ్మట్‌పల్లి ఆలయంలో చోరీ

నవతెలంగాణ-టేక్మాల్



మండల పరిధిలోని బొడ్మట్పల్లి వీర భద్రాలయంలో సోమవారం అర్ధ రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరబడి అమ్మవారి ముక్కు పుడక, తాలి బొట్టు, వీరభద్రుని వెండి తిలకం, వెండి కళ్లు, వెండి మీసాలను చోరి చేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మెన్ బస్వరాజ్ పాటిల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి సీసీ పుటేజీలను పరిశీలించారు. గత నెల 23న రాత్రి సైతం ఆలయ హుండిని పగులగొట్టే ప్రయత్నం చేసిన. వారి ప్రయత్నంలో విఫలం అయ్యారు. తిరిగి జూలై 1 రాత్రి ముగ్గురితో చోరికి పాల్పడినట్లు సీసీ పుటేజీల్లో కనిస్తుంది. ఆలయాల్లో చోరికి పాల్పడి గ్రామంలో భయాందోళన రేపిన ఆ దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ కోరారు.

ఘనంగా కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు గౌడ్ పుట్టినరోజు వేడుకలు తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో మున్సిపల్ భవనం పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుడిని కోరుకుంటామని, కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు అనేక రకాల సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవి గుప్తా, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన జప్తి శివనూరులో చర్చి ప్రహరీ గోడ నిర్మాణానికి జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి మంగళ వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కృష్ణా రెడ్డి మాటా డుతూ గతంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సీడీపీ నిధుల నుంచి చర్చి ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని, మంగళవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డితో పాటు, వైస్ ఎంపీపీ సుజాత శంకర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, నాయకులు నరహరి, మధు తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలపై ఆర్డీవో సమీక్ష

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట



ధరణి దరఖాస్తులపై పేట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మెదక్ ఆర్డిఓ రమాదేవి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అధికారులు వివిధ భూ సమస్యలు, కల్యాణ లక్ష్మి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని పెండింగ్‌లో ఉంచకుండా చూడాలని సూచించారు, మండలంలో 24 ధరణి దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ గ్రేస్ బాయి , ఆర్ఐ శరణప్ప, సిబ్బంది శ్రీకాంత్ తదితరులున్నారు.

రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండలం రెడ్డిపల్లి పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ మేకల పరమేష్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామాయంపేట వ్యవసాయ సంచాలకురాలు వసంత సుగుణ, చేగుంట మండల వ్యవసాయ అధికారి హరిప్రసాదులు హాజరయ్యారు. అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతు భరోసా పథకం కోసం ప్రభుత్వం విధివిధానాలు రూపొందించేందుకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి, విధి విధానాలను ఖరారు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు, సీఈఓ నరేష్, సత్యం, గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-తూప్రాన్



నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలని , వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తూప్రాన్ తహశీల్దార్ విజయలక్ష్మికి బీజేపీ నాయకులు నిరుద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ సంవత్సరానికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జానకిరామ్ గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మన్నె సాయి ముదిరాజ్, పట్టణ ఉపాధ్యక్షులు పోతరాజ్ నాగరాజ్, సాయిబాబా యాదవ్, కార్యదర్శి శరత్, సంపత్, సోషల్ మీడియా విభాగం వినయ్, నాయకులు వెంగళి నవీన్, పిట్ల వంశీ ముదిరాజ్ పాల్గొనటం జరిగింది.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ చేసిన జేసీడీఓ

నవతెలంగాణ-టేక్మాల్



టేక్మాల్ కస్తుర్భాగాంధీ పాఠశాలను జనరల్ కో ఆర్డినేటర్ (జేసీడీఓ) సుకన్య ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో, విద్యార్థులకు వడ్డించే ఆహారం నాణ్యతగా ఉండాలన్నారు. గుడ్లు బాగ లేక పోవడంతో తిరిగి పంపడం జరుగుతుందన్నారు. కూరగాయలు కుళ్లి పోయాయని వాటిని తీసేసి విద్యార్థులకు న్యాతతో కూడిన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. టేక్మాల్ కస్తూర్బా పాఠశాలలో మరమ్మత్తుల కారణంగా గత తరగతులు ఆలస్యంగా మొదలు పెట్టారని, ఆ అధికారి దృష్టికి తీసుకురావడంతో అది వాస్తవమేనన్నారు. మౌళిక సదుపాయాలు లేక పోవడంతో ఆలస్యంగా ప్రారంభించినట్లు చెప్పారు. కస్తూర్బా యస్ఓ విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తూ తోటి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందిస్తు విధుల పట్ల నిర్లక్ష్య వహిస్తే వేటు తప్పదని ఎవరి డ్యూటీవాళ్ళు సక్రమంగా కోవాలన్నారు. టేక్మాల్ యస్ఓ సెలవులో ఉన్నట్లు చెబుతు మాటదాట వేశారు.

పనుల కోసం అడ్డా కూలీల ఎదురుచూపులు

- పనులు దొరకని రోజు దిగులుతో ఇంటి ముఖం
- రెక్కాడితే గాని డొక్కాడని కూలీల బతుకులు
- పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి

అడ్డా కూలీల మొర



నవతెలంగాణ-నర్సాపూర్

ప్రతిరోజు పనుల కోసం అడ్డా కూలీలు ఎవరు పనుల కోసం పిలుస్తారోనని గంటల తరబడి నిలబడి ఎదురుచూస్తున్నారు. పనులు దొరికిన వారు పనులకు వెళితే దొరకని వారు దిగులుతో ఇంటి ముఖం పడుతున్నారు. ఉదయాన్నే లేచి ఇంటి పనులు చేసుకుని పనుల కోసం ఏడు గంటల వరకు నర్సాపూర్‌కు చేరుకుంటారు. అడ్డాపై నిలబడి ఎవరు పనుల కోసం పిలుస్తారోనని ఎదురుచూస్తూ ఉంటారు. ఒకప్పుడు ఉన్న గ్రామాలలో అనేక పనులు దొరికేవి కొన్ని సంవత్సరాల కిందట గ్రామాలలో వ్యవసాయ కూలీలు దొరకాలంటేనే ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం అన్ని రంగాల్లోకి యంత్రాలు రావడంతో గ్రామాలలో పనులు దొరకక అనేకమంది అడ్డా కూలీలుగా మారిన సంఘటనలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు సమృద్ధిగా కొనసాగేవి. అదే పనులకు వెళ్లి ఉన్న గ్రామంలోనే పనులు చేసుకునేవారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు సక్రమంగా కొనసాగకపోవడంతో పనులు దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక అనేకమంది అడ్డా కూలీలుగా మారి పనులు చేసుకుంటున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో హత్నూర మండలం మినహా మిగతా మండలాల్లో పరిశ్రమలు లేకపోవడంతో ఈ మండలాల్లో వ్యవసాయమే జీవనాధారం. గ్రామాలలో వ్యవసాయ రంగంలోకి సైతం యంత్రాలు రావడంతో వ్యవసాయ కూలీలకు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనేకమందికి రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. అయితే ఏమి చేయాలో తెలియక అనేకమంది అడ్డా కూలీలుగా మారి నర్సాపూర్ వచ్చి బిల్డింగ్ పనులతో పాటు ఇతర పనులు చేయడం కోసం తాపీ మేస్త్రీల వద్ద పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషిస్తున్నారు. పనుల కోసం ఉదయాన్నే లేచి ఇంటి పనులు, సొంత పనులు చేసుకొని ఉదయం ఏడు గంటల వరకే పనుల కోసం నర్సాపూర్ అడ్డాకు చేరుకుంటారు. పనులు దొరికిన వారు పనులకు వెళితే దొరకని వారు దిగులుతో ఇంటి ముఖం పడుతున్నారు.

మహిళా కూలీలకు ఇబ్బందులు

మహిళా కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామున లేచి ఇంటి పనులు చేసుకుని పిల్లాపాపలను తయారుచేసి పాఠశాలలకు పంపించి పనుల కోసం నర్సాపూర్ అడ్డాకు చేరుకుంటున్నారు. అదేవిధంగా పనులు చేసే చోట మహిళా కూలీలపై వేధింపులు సైతం జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి

నర్సాపూర్ నియోజకవర్గంలో హత్నూర మండలం మినహా మిగతా మండలాల్లో ఎక్కడ కూడా పరిశ్రమలు లేవు. పరిశ్రమలు లేని మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కూలీలకు ఉపాధి కల్పించాలని పలువురు కూలీలు మొరపెట్టుకుంటున్నారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను సక్రమంగా మొదలుపెట్టి ఉన్న గ్రామంలోని ప్రజలకు పనులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

4న విద్యాసంస్థల బంద్

నవతెలంగాణ-మెదక్ టౌన్



అసమర్థ ఎన్‌టిఏను రద్దు చేయాలని, కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదిన విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అజయ్ తెలిపారు. కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కేజీ టూ పీజీ వరకు విద్యాసంస్థలను బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్య పరిష్కరించాలని, విద్యారంగానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్ విడుదల చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు, స్కూల్, కాలేజ్ యజమాన్యాలు బంద్‌కు సహకరించాలని అజయ్ కోరారు.

నీట్ వ్యవహారంపై మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్

నవతెలంగాణ-నర్సాపూర్



దేశవ్యాప్తంగా నీట్ సమస్యతో 24 లక్షల మంది విద్యార్థులు వారి భవిష్యత్తు చిక్కుల్లో పడిందని ఆవేదన చేందుతుంటే, కనీసం దేశ ప్రధాని స్పందించకపోవడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రజలు ప్రధానిగా మూడోవ సారి నరేంద్ర మోడీని ఎన్నుకుంటే కనీసం ప్రజల సమస్యలను పట్టించుకోని నరేంద్ర మోడీ విద్యార్థుల పట్ల చిన్న చూపు చూడడం బాధాకరం అని ఆయన అన్నారు. వైద్య విద్యలో ఇంత పెద్ద అవినీతి జరగడం దీనిలో అధికారుల పాత్ర కూడా ఉంది అని వారిపైన కఠిన మైన చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీం కోర్టు పరిధిలో నీట్ పరీక్ష అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా కరీంనగర్ ఎంపీ కేంద్రమంత్రి బండి సంజయ్ నీట్ విద్యార్థులపై స్పందించకపోవడం ఏమాత్రం కూడా విద్యార్థులు సహించబోరని, పదోవ తరగతి ప్రశ్నపత్రం లికేజ్‌లో జరిగినపుడు, బండి సంజయ్ విద్యార్థులకు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ ప్రస్తుతం దేశం మొత్తం నీట్ సమస్య వినపడుతున్న ఏమాత్రం కూడా సోయిలేనట్టు వ్యవహరిస్తున్న బండి సంజయ్‌కి తప్పకుండా విద్యార్థులు బుద్ధి చెప్తారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా మళ్లీ నిర్వహణ చేయాలని అన్నారు. నష్టపోయిన విద్యార్థులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా లీకేజీ నిరసనపై ఈనెల 4న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నామని యాజమాన్యాలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ డివిజన్ నాయకులు మహేందర్, రాజు, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతు భరోసా అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని, పి.ఏ.సి.ఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఏ.ఓ హరిప్రసాద్ స్థానిక రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ.ఓ హరిప్రసాద్, ఏ.డీ.ఏ వసంత సుగుణ రైతుల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రైతు భరోసా అమలు పై రైతుల అభిప్రాయం తీసుకోవడం జరిగిందని, మండలం నుంచి స్థానిక రైతులు అందరూ కార్యక్రమంలో పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారని అన్నారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి చెరవేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఏ.సి.ఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారిని విజృంభణ, దివ్య, సహకార సంఘం డైరెక్టర్లు నరసింహ చారి, బీక్యా నాయక్, మైలారం బాబు, స్వప్న, వారాల స్వామి, గొదల ఎల్లం, పలువురు రైతులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలి

- పిహెచ్‌సి మెడికల్ అధికారి డాక్టర్ శిరీష

నవతెలంగాణ-వెల్దుర్తి



సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పిహెచ్‌సి మెడికల్ అధికారి డాక్టర్ శిరీష సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే అవకాశమున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు చేతులను శుభ్రంగా కడుకోవాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రం వేసుకోవాలని సూచించారు. ఏరోజుకారోజు శుభ్రంగా స్నానాలు చేసి తడి బట్టలను వేసుకోవాలని తెలియజేశారు. ఆహారాన్ని భుజించే సమయంలో పూర్తిగా నోట్లో నమిలి మింగాలని తెలియజేశారు. జ్వరము కడుపునొప్పి తలనొప్పి ఎక్కువ విరోచనాలు ఉన్నట్లయితే దగ్గర్లో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ సమాచారం చేరవేసి సరి అయిన వైద్యం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ ఫాతిమా, ఏఎన్ఎం పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు సన్మానం

నవతెలంగాణ-నర్సాపూర్



మెదక్‌లో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో శివంపేట జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తను మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా రెడ్డిలు, శాలువాతో సన్మానం చేశారు. జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా శివంపేట మండలానికి చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల పబ్బ మహేష్ గుప్తాను, కలెక్టర్ రాహుల్ రాజ్, జడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, ఎమ్మెల్యే సునీత రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డిలు అభినందించారు.

దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-నార్సింగి



తెలంగాణ రాష్టంలో దళిత బంధు పథకంలో రెండవ విడతకు ఎంపిక అయిన సుమారు లక్షకు పైగా ఉన్న లబ్ధిదారులకు నిధులను తక్షణమే విడుదల చేసి నిరుపేద దళితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేద దళిత యువతి, యువకులకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా, దేశంలోనే మొట్ట మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలో దళిత బంధు పథకం అమలుకు రూపకల్పన చేసారన్నారు. ఈ పథకంలో లబ్దిదారుల ఎంపిక విధి విధానాలను అనుసరించి అత్యంత పారదర్శకంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన లబ్దిదారుల వివరాలతో కూడిన బ్యాంక్ అకౌంట్లు కూడా తెరవడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో జిల్లాస్థాయిలో కలెక్టర్, అధికారుల ఖాతాలో దళిత బంధు లబ్ధిదారులకు మంజూరు అయిన నిధులు ఫ్రిజ్ కావడం జరిగిందని పేర్కొన్నారు. దీంతో దళిత బందుకు ఎంపికైన లబ్ధిదారులు తమ యూనిట్స్ కొనుగోలుకు నిధులు ఎప్పుడు వస్తాయో తెలియని, అయోమయంలో ఉన్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దళిత బందు యూనిట్ నిధులు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన దళిత బందు లబ్దిదారుల యూనిట్స్ కొనుగోలు నిధులు వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ రాష్టంలో ఉన్న దళిత నిరుద్యోగులు యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని బాబు కోరారు. వివిధ పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వము మేనిఫెస్టో లో ప్రకటించిన హామీల మేరకు రూ.12 లక్షలు చొప్పున లబ్ధి దారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అప్పులు చేసి చేయించిన పనులకు బిల్లులు ఇప్పించాలి

నవతెలంగాణ-చేగుంట



గ్రామ అభివృద్ధి పనులకు అప్పులు చేసి నిధులు కేటాయించి పనులు చేయించిన వాటి బిల్లులు ఇప్పించాలని ఉమ్మడి చేగుంట మండల చెట్లతిమ్మాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు చేసిన పనులు పారిశుద్యం, వీధిదీపాలు, డ్రైనేజీలు, సిసి రోడ్లు, తాగునీటి సదుపాయాలు, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డీజిల్ బిల్లు, పల్లె ప్రగతివనము మొదలగు పనులకు రూపాయలు ఖర్చు చేశామని, సుమారు రూ.6,80,000లు మొత్తము పెండింగ్లో ఉన్నాయి. ఇలాంటి చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగింది. అప్పులు తెచ్చిన వాటికి మిత్తిలు కటలేక పోతున్నము, ఉన్న ఆస్తిలను కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 7 నెలలు గడుస్తున్న గ్రామపంచాయతీలకు నిధులు కరువైనందున ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి గ్రామపంచాయతీలకు పాత పెండింగ్ బిల్లులు, అలాగే పారిశుద్ధ్య కార్మికుల జీతాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. లేకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు. అలాగే తెలంగాణ రైతు బిడ్డలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతుబంధు అలాగే రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని ఉమ్మడి చేగుంట మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మోహన్ రాథోడ్ కోరారు.

సాగు చేసిన భూమికి ఒక్కరికి రైతు భరోసా ఇవ్వాలి

నవతెలంగాణ-చిలిపిచేడ్



మండల పరిధిలోని సొమ్మక్కపేట సొసైటీ వద్ద ఏర్పాటుచేసిన రైతు భరోసా పై రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. మంగళవారం నాడు ఏర్పాటుచేసిన సభలో రైతులందరూ 10 ఎకరాల వరకు రైతు భరోసాను ప్రభుత్వము అందించాలని కోరారు. 10 ఎకరాల లోపు విస్తీర్ణం గల రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీడు భూములకు వ్యవసాయేతర భూములకు రైతు భరోసా అందించడంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్ కరుణాకర్, సొసైటీ సీఈవో పోచయ్య, సోమక్కపేట్ సొసైటీ వైస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం బాధాకరం

- జెడ్పీటీసీ బాబ్య నాయక్

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మండల పరిషత్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి బీఆర్ఎస్ ప్రజా ప్రతి నిధులను ఆహ్వానించకపోవడం బాధాకరమని, జడ్పిటిసి బాబ్య నాయక్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావులు అన్నారు. మంగళవారం వారు నర్సాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు మండల పరిషత్ కాంప్లెక్స్ శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు కేవలం కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను, కాంగ్రెస్ నాయకులను మాత్రమే పిలిచి వారి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించడం, ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. శంకుస్థాపన కార్యక్రమంలో అధికారులు రాజకీయం చేస్తూ ఫోటో కాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, బిఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, జితేందర్ రెడ్డి, సూరారం నర్సింలు, బిక్యా నాయక్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ హనుమాన్ దేవాలయ మూడో వార్షికోత్సవం

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ దేవాలయం మూడో వార్షికోత్సవం మంగళవారం గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యవచనం, స్వామి వారికి అభిషేకం వంటి కార్యక్రమాలను పూజారుల చేత ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలమాలతో పట్టు వస్త్రాలు స్వామి వారిని అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మాజీ జెడ్పిటిసి ఆముద ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
4
సిద్దిపేట
బుధవారం | 03 జులై 2024 | www.navatelangana.com

ఉచిత నీటికి పన్ను కట్టేదెలా...!



- ప్రతిపక్షాలు, మహిళల ధర్నా

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

మిషన్ భగీరథలో ఇంటింటికి ఉచిత నల్ల కలెక్షన్ ఇచ్చిన గత ప్రభుత్వం ఏనాడు బిల్లు వసూలు చేయలేదని, మిషన్ భగీరథ ఉచిత నీటికి కాంగ్రెస్ ప్రభుత్వంకు ఇప్పుడు బిల్లు కట్టేదెలా అని మంగళవారం బీ ఆర్ఎస్, బీఎస్పీ , బీజేపీ, మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉచితంగా ఇచ్చిన నల్లా కనెక్షన్లకు బిల్లులు ఎలా వసూలు చేస్తారని వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీటి పన్నుపై కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు. కనెక్షన్లు ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్న ఎప్పుడు బిల్లు కట్టలేదని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఉచిత నీటిని అందించాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి మున్సిపల్ కమిషనర్ తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి, బీఎస్పీ హుస్నాబాద్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బీజేపీ నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు

రైతు భరోసా పై రైతు అభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని రేబర్తి సొసైటీలో రైతు భరోసా అమలుపై రైతు అభిప్రాయ సేకరణ సమావేశాన్ని చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిద్దిపేట జిల్లా ఆడిట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడుతూ రైతు భరోసా అమలుపై కొంతమంది రైతులు 10 ఎకరాల వరకు రైతు భరోసా అమలు చేయాలని, కొంతమంది రైతులు ఐదు ఎకరాల వరకే రైతుబంధు అమలు చేయాలని తెలిపారు. అలాగే కొంతమంది రైతులు రైతు భరోసా అవసరం లేదని గిట్టుబాటు ధర కల్పించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రామకృష్ణ, సీఈఓ బోయిని శ్రీధర్, ఏఈఓలు రాకేష్, అఖిల్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అటవీ హద్దులను నిర్ధారించుటకు సర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

నవ తెలంగాణ - సిద్దిపట కలెక్టరేట్

అటవీ హద్దులను నిర్ధారించుటకు, ఆక్రమణలను తొలగించుటకు ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23738 హెక్టార్ల అటవీ విస్తీర్ణం 77 ప్రాంతాలలో కలదని అన్నారు. అటవీ హద్దులను నిర్ధారించుటకు, ఆక్రమణలు తొలగించుటకు అటవీ, రెవెన్యూ శాఖలు జాయింట్ సర్వే పూర్తి చేయాలని అన్నారు. పెండింగ్లో ఉన్న అటవీ బ్లాక్‌లను తగినట్లు నోటిపై చేయుటకు వివాదాలను తొందరగా పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూ రికార్డులలో అటవీ బ్లాక్‌లను చేర్చాలని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు వేసవికాలంలో మంటల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఫారెస్ట్ రేంజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జీవో 46ను రద్దు చేయాలి

- బీజేవైఎం మండలాధ్యక్షుడు రమేశ్ యాదవ్
- ప్రకటనలో అదనపు ఉద్యోగాలు చేర్చాలని తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-బెజ్జంకి



ఉద్యోగ నియమకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో 46 ను వెంటనే రద్దు చేయాలని బీజేవైఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం మండల కేంద్రంలోని తహసీల్ యందు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం మండల శాఖ అధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రమందజేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆదే పంథాను కొనసాగించకుండా ప్రకటనల్లో అదనపు ఉద్యోగాలను చేర్చి న్యాయం చేయాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు తూముల రమేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి అనిల్ రావు, పట్టణ అధ్యక్షుడు సంగ రవి, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గంప రవి కుమార్, నాయకులు ఐలేని భాస్కర్ రెడ్డి, అడుకని వీరేశం, గంగుల ఏళ్ళం, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరున సేవ చేయడం గొప్పతనం

- విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ

నవ తెలంగాణ -హుస్నాబాద్ రూరల్



గంగిశెట్టి జగదీశ్వర్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తన తల్లి పేరునా ట్రస్టు ఏర్పాటు చేసి సమాజంలోని పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు చేయడం గొప్పతనమని పొట్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్య అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రైమరీ పాఠశాలలో 73 మంది విద్యార్థులకు హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సంధ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేయడం మధ్యాహ్న భోజనానికి ఎంతో ఉపయోగకరమన్నారు. పరీక్ష ప్యాడ్స్, పదవ తరగతిలో మంచి జీపీఏ సాధించిన విద్యార్థులకు మెరిటేరియస్ అవార్డ్ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రభాకర్ రావు, వేణుమాధవ్, బిక్షపతి, శివకుమార్, సరస్వతి, సరళ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట ఏసీపీ మధు

నవ తెలంగాణ - కొండపాక



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు విద్యార్థులకు సూచించాడు.కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి సైబర్ నేరాలపై గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలను వివరించారు.డ్రగ్స్,గంజాయి, మత్తు పదార్థాలు వాడటంతో జీవితాలు నాశనం అవుతాయన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించేవరకు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భైరయ్య, అధ్యాపకులు, సిద్దిపేట షీ టీమ్ సిబ్బంది కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుల్లు మమత వీణ కుమారి, కానిస్టేబుల్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

నవ తెలంగాణ - మిరుదొడ్డి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడం జరిగిందని బీజెవైఎం మండల అధ్యక్షుడు సాధానందరెడ్డి అన్నారు. జాబ్ క్యాలెండర్ వెంటనే రాష్ట్రప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు సదానంద రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు మేలు చేస్తానని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. గతంలో నిరుద్యోగులను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పినట్లుగానే, కాంగ్రెస్ ప్రభుత్వానికి సైతం హామీలు అమలు చేయకపోతే గుణపాఠం తప్పదన్నారు. వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లా వినతి పత్రాన్ని తహసీల్దార్ గోవర్ధన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యవాదుల గొంతునొక్కేలా నేరచట్టాలు

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ- గజ్వేల్



దేశవ్యాప్తంగా సోమవారం నుంచి కొత్తచట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు.ఇందులోని సెక్షన్‌లు కొన్ని ప్రాథమిక హక్కులను భంగం కలిగించె విధంగా ఉండటం దారుణమని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్యవాదుల గొంతునొక్కెల ఈ చట్టాలున్నయన్నారు. ప్రతిపక్షాలతో చర్చ లేకుండా, ప్రజలకు, ప్రజాస్వామ్య వాదులకు సమాచారం లేకుండా కొత్తనేర చట్టాలను ఎందుకు అమలు చేయాల్సి వచ్చింది.ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలుగేలా, నిరసనలకు పోలిసులే అనుమతినిచ్చి వారే అరెస్టు చేయవచ్చు ఈ చట్టాలు ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేసేవిధంగా ఉన్నయన్నారు.3 నుంచి 7 ఏళ్ళలోపు శిక్షపడే నేరారోపణల్లో డీఎస్పీ అనుమతితో 14 రోజులపాటు విచారణ జరిపి అది తీవ్రత లేదనిపిస్తే ఆ పిర్యాదును ఎఫ్ఐఆర్ కట్టకుండానే క్లోజ్ చేసే అధికారం విచారణ అధికారికి లభించడం వలన డబ్బు, పలుకుబడి, రాజకీయ అండదండలతో కేసులను పెద, బలహీన వర్గాల వారికి అన్యాయం జరిగే అస్కారమున్నదనే అందోళన కలుగుతుందన్నారు.ఈ కార్యమంలో మైసయ్య, రాజేష్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో చెక్కు మార్పిడి

- కళ్యాణలక్ష్మి చెక్కు గతంలోనె మంజూరు
- నవతెలంగాణ వార్తతో వెలుగుచూసిన వైనం

నవతెలంగాణ-కోహెడ

అధికారుల నిర్లక్ష్యంతో ఒకరికివ్వాల్సిన చెక్కును మరోక వ్యక్తికి అందజేసి చేతులు దులుపుకున్న పరిస్థితి కోహెడ మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు నంగునూరి అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన నంగునూరి అంజయ్య, పోచవ్వల కూతురు నంగునూరి అర్చన వివాహం 2022 డిసెంబర్ 17వ తేదీన జరిగింది. దీంతో మార్చి 2023లో ఆన్‌లైన్‌లో సంబంధిత పత్రాలను చేర్చి ధరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేశాడు. సంవత్సర కాలంగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళి కళ్యాణలక్ష్మీ చెక్కు రావడం లేదని అడగగా వస్తుందని కొంత సమయం పడుతుందని సూచించడంతో కాలం వెల్లదీస్తూ వచ్చాడు. ఇటీవల సంవత్సరం గడిచిన కళ్యాణలక్ష్మీ చెక్కు చేతికందడం లేదని జూన్ 28వ తేదిన నవతెలంగాణలో ప్రచురించడంతో తహసీల్దార్ సురేఖ చొరవతీసుకొని వివరాలు తీసుకున్నారు. దీంతో ఇప్పటికే సెప్టెంబర్ 2023లో కళ్యాణలక్ష్మి చెక్కు మంజూరవ్వడంతో పాటు సంతకం చేసి చెక్కును తీసుకున్నట్లు తెలిసింది. బాధితుడు అంజయ్యను పిలిపించి ఇప్పటికే మీరు చెక్కు తీసుకున్నారని తెలపడంతో ఖంగుతిన్నాడు. నేను ఎలాంటి చెక్కు తీసుకోలేదని అధికారులకు తెలుపగా పూర్తి వివరాలను ఆరాతీయగా ఇప్పటికే ఆ చెక్కు ఇదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తికి ఇచ్చినట్లు అధికారులు తెలుసుకున్నారు. ఆ వ్యక్తి వద్దకు వెళ్ళి చెక్కుకు సంబంధిత డబ్బును రిటన్ చేయాలని సూచించగా రెండు మూడు రోజులలో అందజేస్తానని తెలిపినట్లు సమాచారం. ఇట్టి విషయంపై తహసీల్దార్ సురేఖను చరవాణిలో వివరణ అడుగగా జరిగిన విషయం వాస్తవమేనని తెలిపారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు కళ్యాణలక్ష్మీ ఆసరాగా నిలుస్తుందని మంజూరి చేస్తే దానిని లబ్దిదారులకు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైనదికాదని పలువురు విమర్శిస్తున్నారు.

స్పందన



8 నెలల్లో వేల కోట్ల అప్పు చేసిన సీఎం

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ -గజ్వేల్

ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.40 వేల కోట్ల అప్పులు చేసినట్లు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉబ్బని అశోక్ ఇటీవల నీటిలో మునిగి మృతి చెందారు. పార్టీ సభ్యత్వం కింద రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును పార్టీ నాయకులతో కలిసి అశోక్ సతీమణి ఉబ్బని పోషవ్వకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కోట్లు అప్పులు చేసి ఏ సంక్షేమ పథకం అమలు చేశారో ముఖ్యమంత్రి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు ఆత్మహత్యలు తిరిగి ప్రారంభమైనట్లు ఆయన విమర్శించారు. రైతులందరూ మందు డబ్బులతో వీడియోల చిత్రీకరించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, కాంగ్రెస్ సోషల్ మీడియాకు పంపిస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్‌కు తగిన బుద్ధి రైతులు చెప్తారని ఆయన అన్నారు. ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో కరువు విలయ తాండవం చేస్తుందని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణలో వర్షాలు కూడా రావడంలేదని ఆయన హేళన చేశారు. ఇచ్చిన 6 గ్యారంటీలో బస్సు ప్రయాణం మినహా ఏది కూడా అమలు కావడం లేదని ఆయన అన్నారు. 200 యూనిట్లు విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ ఈ పథకాలు ఎంతమందికి అమలు చేశారని ఆయన ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో పెన్షన్ పెంచి పంపిణీ చేసిన ఇక్కడి తెలంగాణ ముఖ్యమంత్రికి కనిపించకపోవడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణలో కూడా ఎన్నికల ముందు ఇచ్చిన పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. మహిళలకు రూ. 2500 వెంటనే చెల్లించాలన్నారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటామని ఆయన చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ పంగ మల్లేశం, కోమటి బండ మాజీ సర్పంచ్ తూమ్ శేఖర్ పటేల్, గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవి కంటి చంద్రశేఖర్ గుప్తా, గొడుగు స్వామి, పాల రమేష్ గౌడ్, హైమద్, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

- అడిషనల్ డీసీపీ ఎస్. మల్లారెడ్డి



నవ తెలంగాణ - సిద్దిపేట

ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని, మోసం చేసిన జోరవంతల సత్యనారాయణను అరెస్టు చేసినట్లు అడిషనల్ డీసీపీ ఎస్. మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో సీతారాం నగర్‌లో ఓ టీచర్ ఇంట్లో సత్యనారాయణ ఆఫీస్ ప్రారంభించాడని, యాంటీ కరప్షన్ ఇంటలిజెన్స్ కమిటీలో జనరల్ సెక్రటరీగా, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాలో, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా, టీవీ5 రిపోర్టర్‌గా పని చేశానని కార్డులు చూపిస్తూ తన వద్దకు వచ్చినవారికి ప్రభుత్వ, ప్రవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగిస్తున్నాడని తెలిపారు. అలా మోసపోయిన, ఫిర్యాదు దారుడు వరప్రసాద్, అశోక్‌లు తెలంగాణ రాష్ట్రం ఆఫీసులో సబ్ ఆర్డినేటర్ ఉద్యోగం రెండు నెలల వ్యవధిలో ఇప్పిస్తానని చెప్పి మొత్తం ఖర్చు రూ.6 లక్షల అవుతుందని చెప్పాడని, నిందితుని మాయ మాటలు నమ్మి మూడు విడతలుగా ఫిర్యాది అయిత వరప్రసాద్ రూ. 4 లక్షల 15 వేలు ఇచ్చినాడని, బక్కోళ్ల అశోక్ 1 లక్షల 50వేలు ఇచ్చినాడని తెలిపారు. నిందితుడు ఆఫీసును ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఎదురుగా మరో ఇంట్లోకి మార్చుకున్నాడని, ఆఫీస్ ఖర్చులకు డబ్బులు కావాలని రెంట్ అడ్వాన్స్ ఇవ్వాలని చెప్పి మరో రూ.15 వేల తీసుకున్నాడని తెలిపారు. రెండు నెలల తర్వాత వెళ్లి అడగగా గవర్నమెంట్ మారింది ఎలక్షన్లు జరుగుతున్నాయి, తర్వాత జాబు ఇప్పిస్తానని మాయ మాటలు చెబుతూ కాలయాపన చేసినాడని తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించినాడని ఫిర్యాది పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు, ఎస్ఐ నర్సింహారావు సిబ్బందితో కలిసి కేసు విచారణలో భాగంగా పై నిందితున్ని చాకచక్యంగా పట్టుకొని, విచారించగా గతంలో టీవీ5 రిపోర్టర్‌గా పని చేసినాను, అందులో నుంచి బయటకు వచ్చి ఆన్లైన్లో యాంటీ కరప్షన్ ఇంటెలిజెన్స్ కమిటీ మెంబర్‌గా పని చేసినని, సెంట్రల్ విజిలెన్స్ కమిటీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఐడీ నెంబర్ 4718 తెలంగాణ రాష్ట్రం పేరుపైన ఐడీ కార్డు తీసుకుని, ఎక్స్పైర్ అయిన ఐడీ కార్డ్ చూపిస్తూ ఉద్యోగాల పేరుతో నమ్మించి మోసం చేస్తున్నట్టు అంగీకరించినట్లు తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. పై నిందితునికి ఎవరైనా డబ్బులు ఇచ్చి మోసపోయిన వారు ఉంటే సిద్దిపేట వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు ఎవరు నమ్మకండి అని సూచించారు. ఈ సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు, ఎస్సై నర్సింహారావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతిని అమలు చేయాలి

- బీజేపీ నిరసన

నవతెలంగాణ -గజ్వేల్

నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు బీజేపీ గజ్వేల్ కన్వీనర్ బండార్ మహేష్, మండల పార్టీ అధ్యక్షులు అశోక్ గౌడ్, గజ్వేల్ మున్సిపల్ అధ్యక్షులు మనోహర్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ప్లే కార్డ్స్ తో నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు నెల నెలకు నిరుద్యోగ భృతిని అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కావడం లేదని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అందుకే మూడోసారి మోడీ అధికారంలోకి వచ్చారని వారు గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగుతుందని తొందరగానే ఇంటికి పంపిస్తారని వారు విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తాహసీల్దార్‌కు వినతి పత్రం అందించిన వారిలో గజ్వేల్ పట్టణ బీజేపీ నాయకులు జూపల్లి సాయి కిరణ్, కరుణాకర్, మని శేఖర్, ఆనంద్ గౌడ్, ఆర్కే యాదవ్, మోహన చారి, బారు అరవింద్, పంజాల కుమార్, నాయిని సందీప్, బాస్ రాజు, పొట్టి లక్ష్మణ్, వెంకట్ ప్రసాద్, రాకేష్ గౌడ్, నవీన్, మోహన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



దళిత ఎస్ఐను వేధించిన సీఐని సస్పెండ్ చేయాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



నవ తెలంగాణ- మిరుదొడ్డి

దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనును వేధించిన అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి ని సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఎస్సీ కమిషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బాబు నాయక్, జిల్లా శంకర్‌లకు సైతం వినతి పత్రం సమర్పించారు. యశోద ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఎస్ఐని డీబీఎఫ్ బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ మాట్లాడుతూ గత ఐదు నెలలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనుగారు విధులు నిర్వహిస్తున్నారన్నారు. స్టేషను ఎస్‌హెచ్ఓ అయిన జితేందర్ రెడ్డి అడుగడుగున ఎస్ఐ పై కుల వివక్షతను ప్రదర్శించారని, ఆరుగురు కానిస్టేబుల్‌ను వసూలకు పెట్టుకొని ఎస్ఐని నిలబెట్టి కానిస్టేబుల్‌లను కూర్చొపెట్టి అవమానపర్చాడన్నారు.అంతటితో ఆగకుండా తానే అవినీతి అక్రమాలు, వసూళ్లకు పాల్పడుతు ఎస్ఐ పైననే తప్పుడు అవినీతి ఆరోపణలు చెయిస్తూ పత్రిక ప్రకటనలు ఇప్పించాడన్నారు. మానసికంగా కులం పేరుతో అవమానపరుస్తు నిరంతరం వేధింపులు చేస్తుండటంతో కొన్ని రోజులు సెలవు పై సైతం వెళ్లాడన్నారు. సీఐ వెధింపుల పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సీఐ జితెందర్ రెడ్డి పై చర్యలు తీసుకొలేదన్నారు. దీంతో రెచ్చిపొయిన సీఐ మరింత వెధింపులకు గురి చేశాడన్నారు.ఈ వెధింపులను తట్టుకోలేక తన స్వంత జిల్లా కేంద్రమైన మహబూబాబాద్‌కు జూన్ 30న రాత్రి చెరుకొని మార్కెట్‌లో పురుగుల మందు తాగి ఎస్ఐ శ్రీ రాములు శ్రీను ఆత్మహత్యయత్నం చేసుకున్నాడన్నారు. ప్రాణపాయ స్థితిలో ప్రస్తుతం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు.దళిత ఎస్ఐ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్ రెడ్డిని సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలి. ఎస్ఐకి మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందించాలి. పోలీస్ శాఖలో కుల వివక్ష పై అవగహన కల్పించి ఎస్సీ, ఎస్టీ పోలీస్ సిబ్బందిపై వేధింపులను అరికట్టెందుకు చర్యలు తీసుకోవాలి. ఎస్ఐ ఆత్మహత్యాయత్నంపై విచారణ జరపాలన్నారు. సీఐ జితేందర్ రెడ్డి గతంలో అవినీతి, దొంగ నోట్ల కేసులో సస్పెండ్ అయిన విషయాన్ని పరిగణలోకి తీసుకొవాలన్నారు.ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు పులి కల్పన, నగర నాయకులు బ్యాగరి బాస్కర్, మల్లేశం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బదులు బట్టసంచులను వాడాలి

- చెత్త విభజనపై 11వ వార్డులో అవగాహన
- మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

మార్కెట్‌కు వెళ్ళినప్పుడు ప్లాస్టిక్ కవర్‌లకు బదులు బట్టసంచులను వాడాలను హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో చెత్త విభజనపై అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్మికులకు భద్రత పరమైన సూచనాలతో చెత్త వ్యర్థాలు వేరు చేయుటకు హ్యాండ్ బ్లౌజులు, సేఫ్టీ జాకెట్ల ను చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ ప్రతి ఇంటి యజమానులు చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని, ఇంటి స్థలం ఉన్నవాళ్లు వారి ఇంట్లోనే తడి చెత్తతో ఎరువు తయారు చేసుకోవచ్చని సూచించారు. తయారుచేసిన ఎరువును మొక్కలకు వాడుకోవాలని కోరారు. పొడి చెత్తను మున్సిపల్ వాహనానికి అందిస్తే రీసైక్లింగ్ లేదా రియూజ్ చేసుకోవచ్చని తెలిపారు .సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం వల్ల భూ కాలుష్యం పెరిగి పర్యావరణానికి హాని కలుగుతుందని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో కమీషనర్ మల్లిఖార్జున్, వార్డు కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, సానిటరీ ఇన్స్పెక్టర్ బాలఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవికుమార్, వార్డ్ అధికారి శారద, సూపర్వైజర్ నవీన్, వార్డ్ ఆర్పీ స్వర్ణలత, జవాన్ సారయ్య ప్రభాకర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య



నవ తెలంగాణ - మిరుదొడ్డి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వన మహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలని డీఆర్ డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ప్రశాంతమైన వాతావరణంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే వన మహోత్సవంలో అధికారులు అంకితభావంతో పనిచేసి మొక్కలు నాటే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి సుభాష్ ఏపీఎం బాలకృష్ణ , సిబ్బంది పలుకు పాల్గొన్నారు.

ఆగివున్న లారీని ఢీకొట్టిన బైక్

- ఒక్కరికి తీవ్ర గాయాలు

నవ తెలంగాణ - కొండపాక

కొండపాక మండలం నాగుల బండ సమీపంలో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీ కొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్దెడ గ్రామానికి చెందిన కుంట మల్లేష్ సిద్దిపేట నుంచి దుద్దెడ వెళ్తున్న క్రమంలో ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి సమీపంలోకి రాగానే తన ముందు ఆగివున్నా లారీని బలంగా ఢీకొని కిందపడిపోయాడు. దాంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.



డీఐఈఓను కలిసిన గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

నవ తెలంగాణ - సిద్దిపేట



తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు నూతనంగా డిఐఈ ఓ గా బాధ్యతలు చేపట్టిన హిమబిందును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా స్వీట్లను తినిపించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రవి, నాగేందర్, నంట శ్రీనివాస్ రెడ్డి, రాములు, చిట్టి శ్రీనివాస్, శనిగరం శ్రీనివాస్, వనజా రెడ్డి , మంగ్త నాయక్, శంకర్, నగేష్, రాజు, రమాదేవి, శ్రీనివాస్, సాజిద్, శ్రీనివాస్ రెడ్డి, రవి, సంపత్ కుమార్ , లక్ష్మీ ప్రసాద్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు , వందన, అనిత ,శ్రీ లీల , అర్చన , శివకుమార్ ,సుధాకర్, దుబ్బాక రఘు, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండలంలోని 32 గ్రామాల పరిధిలో ఉన్న ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీల యొక్క ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటివరకు ప్రజలకు ఎన్నో సేవలు అందించామని అన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు చేసినటువంటి పనులను గుర్తు చేసుకున్నారు. మా పాలనలో అధికారులు మాకెంతో సపోర్ట్ చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రంలోనికి చెందిన దివంగత విశ్రాంత ఉపాధ్యాయుడు సాంబరాజు హరికృష్ణ, వ్యవసాయ క్షేత్రంలో సాంబరాజు ప్రమీల, ఆధ్వర్యంలో వారి మనవడు సాయి సంప్రీత్, కుటుంబ సమేతంగా శ్రీ భక్తాంజనేయ స్వామి, విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా జరిపించారు. అర్చకులు పానుగంటి తిరుపతయ్య, నిర్వహణలో అర్చకులు అర్చనలు, అభిషేకాలు, పూర్ణహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ, మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి ఘనంగా సన్మానం

నవతెలంగాణ -జగదేవ్‌పూర్



జగదేవ్‌పూర్ మండలం పరిధిలోని తీగుల్ నర్సాపూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల 14 సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు సమతను స్థానిక తాజా మాజీ సర్పంచ్ రజిత రమేష్ మంగళవారం నాడు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా 14 సంవత్సరాలు పూర్తి చేసి బదిలీపై వెళ్లడం కొంచెం బాధగా ఉందని అన్నారు. విద్యార్థుల చదువుల పట్ల నిబద్ధతతో పనిచేసి తన యొక్క స్థాయిని గ్రామస్తుల్లో చాటుకున్నారని అన్నారు. విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలతో పోటీపడే విధంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. 2010 నుంచి ఇప్పటివరకు పాఠశాల విద్యార్థుల పట్ల తల్లిదండ్రులతో సమానంగా ప్రేమను చాటి నాణ్యమైన విద్యను అందించినందుకు గర్వంగా ఉందని గుర్తు చేశారు. ఎలాంటి నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లినా ఆయురారోగ్యాలతో ఉంటూ మంచి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని గ్రామం తరపున కోరుకుంటున్నామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ ఆలయ మాజీ ఛైర్మన్ లక్ష్మీనరసింహ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంచర్ల స్వామి, నాయకులు హరిబాబు, అంగన్వాడీ వర్కర్ భాగ్య, పాఠశాల పోషక మహాసేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పెద్దపీట వేస్తున్నాం

- అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్



మహిళల రక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సిద్దిపేటలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను, భరోసా సెంటర్‌ను సందర్శించి, ఎలాంటి దరఖాస్తులు వస్తున్నాయి, రోజుకి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి తదితర అంశాల గురించి ఇన్స్పెక్టర్ దుర్గను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల దరఖాస్తులపై వెంటనే స్పందించాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలని, వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్య క్షేత్రంలో కృత్తికా నక్షత్ర విశేష పూజలు

నవతెలంగాణ-వర్గల్



ప్రసిద్ధ వర్గల్ శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్య క్షేత్రంలో మంగళవారం కృత్తికా నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సతీసమేతులైన శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో కృత్తికా నక్షత్ర పూజలు నిర్వహించగా, విశేష సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

పాఠశాలకు శుద్ధజల యంత్రం వితరణ

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుభ్రమైన త్రాగు నీరును అందించడానికి స్థానికుడు నూనె లక్ష్మన్ తన తండ్రి నూనె పెద్ద రాజయ్య జ్ఞాపకార్థంగా శుద్ధ జల యంత్రాన్ని మంగళవారం పాఠశాలకు అందజేశారు.పాఠశాల బోధన సిబ్బంది, విద్యార్థులు, నూనె లక్ష్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు


నవతెలంగాణ- జగదేవ్‌పూర్



జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో గల శ్రీ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. అమ్మవారి హుండీ ద్వారా వచ్చిన ఆదాయం ఆలయ అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామని ఈవో రవికుమార్, దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (86) రోజుల హుండీ ఆదాయం లెక్కించగా రూ. 8 లక్షల 4 వేలు 353 వచ్చినట్లు తెలిపారు.హుండీ ద్వారా వచ్చిన డబ్బులను అమ్మవారి బ్యాంక్ ఖాతాలో జమ చేయించి ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం ఖర్చు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ తాజా మాజీ సర్పంచ్ రజిత రమేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంచర్ల స్వామి, ఆలయ సిబ్బంది వెంకటరెడ్డి, కనకయ్య, యాదగిరి, లక్ష్మన్, హరి, తిరుపతి, అంజయ్య, మల్లయ్య, సుధాకర్, చిన్న, సాయిబాబా, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం


నవ తెలంగాణ - కొండపాక



పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. దుద్దెడ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త జక్కుల మమత కుటుంబానికి రూ. 2 లక్షల చెక్కును మంగళవారం ఆయన అందించారు. జక్కుల మమత రోడ్డు ప్రమాదంలో మరణించగా పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ మంజూరు కావడంతో ఆ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, తెలంగాణ జాగృతి నాయకులు అనంతుల ప్రశాంత్, రైతుబంధు మాజీ కోఆర్డినేటర్ రాగల దుర్గయ్య , మాజీ ఎంపీపీ బైరెడ్డి రాధా కిషన్ రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిలుముల రామ్మోహన్, సీనియర్ నాయకులు మల్లమారి రవీందర్, దోమల ఎల్లం, పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్, దొమ్మాట లక్ష్మారెడ్డి, దొమ్మట మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన బొమ్మని నర్సమ్మ (68) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం వంటి మామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట చేబర్తి మాజీ సర్పంచ్ ఎర్రబాగు ఆశోక్, మాజీ రైతు బంధు సమితి అధ్యక్షులు జాలని బాలనర్సయ్య, నాయకులు ర్యాకం యాదగిరి, గాలేష్, శ్యాంసుధర్, చాట్లపల్లి కృష్ణ, మల్లేషం, తదితరులున్నారు.

నాయి బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- సిద్దిపేట జిల్లా నూతన కమిటీ అధ్యక్షులు కోత్వాల్ యాద నరేందర్
- ప్రధాన కార్యదర్శి కొండూరు సతీష్ కుమార్

నవతెలంగాణ-మద్దూరు



నాయిబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని, రాజకీయాల కోసం సంఘీయులని కొందరు వ్యక్తులు మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని రాష్ట్ర నాయకత్వాలతో సంబంధం లేకుండా మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్లో స్వతంత్రంగా సిద్దిపేట జిల్లా సంఘం నిర్మాణం పూర్తి చేసిన్నట్లు సిద్దిపేట జిల్లా నాయిబ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్వాల్ యాద నరేందర్, ప్రధాన కార్యదర్శి కొండూరి సతీష్ కుమార్ లు తెలిపారు. ఈ సందర్భంగా ధూల్మిట్ట మండల కేంద్రంలో మండల అధ్యక్షులు కొండూరు అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు రోజురోజుకు ఆర్థికంగా చితికిపోతూ మైనారీటీలోకి పడిపోతున్న తమ కులస్తులను ఆదుకోవడానికి, కేంద్ర రాష్ట ప్రభుత్వాలు కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని కులాలకు సముచిత స్థానం అందిస్తున్న, తమ మంగళి కులస్తులు మాత్రం మైనార్టీలోకి (రోజురోజుకు కుంటుపడుతున్నారు.) పడిపోతున్నారని వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, కార్పోరేషన్ ఏర్పాటు చేసి తక్షణ సహాయం ప్రకటించి ప్రతి కుటుంబానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబానికి రూ. 2 లక్షల 100 శాతం సబ్సిడితో అందించాలని అన్నారు. వైద్యవృత్తిని ప్రపంచానికి పరిచయం చేసిన వృత్తిగా, నేటి డాక్టర్లకు తీసిపోకుండ ప్రత్యక్ష సేవలు చేసే కులవృత్తి దారులు నాయి బ్రాహ్మణులు అని, ఆరోగ్య విషయంలో రాజీలేని సేవలు చేసే తమ నాయి బ్రాహ్మణులకు నేడు భరోసలేని జీవితాలు జడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ఉద్యోగాలలో అంగన్వాడి, ఆశ కార్యకర్తలుగా, ఏఎన్ఎంతో పాటుగా పలు ఉద్యోగాలలో తమ నాయి బ్రహ్మణ మహిళలకు మెదటి ప్రాధాన్యత అవకశాలను కల్పించాలని జిల్లా నాయకులు ముక్త కంఠంగా కోరారు. అలగే ప్రభుత్వాలు గర్తించిన దేవాలయాల్లో పాలకవర్గం సభ్యులుగా అవకాశాలను కల్పించాలని, అలాగే కల్యాన కట్టలో పుట్టువెంట్రుకలు తీస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కొమురవెల్లి దేవస్థానం వద్ద నాయిబ్రహ్మణ ధర్మసత్రం ఏర్పాటు చేయాలని వారు కోరారు. పక్కన ఉన్న రాష్ట్రాలలో సాయిబ్రాహ్మణులకు పలు విధాలుగా ప్రభుత్వాలు ఆదుకోంటూ, ప్రభుత్వం ప్రత్యేక్షంగా, పరోక్షంగా చట్టసభల్లో అవకాశాలను కూడ కల్పిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణాలో కూడ ఇక్కడి ప్రభుత్వం తమ కులంకు ఆర్థిక భరోసాతో పాటుగా, రాజకీయంగా నామినేట్ పదవులు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా నాయిబ్రాహ్మణ కులస్థులు, గ్రూపులు కాకుండా ఐక్యతతో ఒకే కులం, ఒకే సంఘం, ఒకే నాయకత్వం దిషగా అడుగులు వేయాలని, సమస్యల సరిష్కారానికి కృషిచేయాలని జిల్లా నాయకులు కోరారు. రాష్ట్రంలోని అనేక సంఘాలను ఒకే తాటిపైకి తీసుకరావడానికి సిద్దిపేట జిల్లా సంఘం ఆదర్శంగా నిలువడానికే. నేడు రాష్ట్ర నాయకత్వాలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా సిద్దిపేట జిల్లా సంఘం నిర్మాణం పూర్తి చేసినట్లు గౌరవ అధ్యక్షులు అల్లుల స్వామి, ఉపాధ్యక్షులు సింగిరాల శ్రీనివాస్, సలహాదారులు సింగిరాల కనుకయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మద్దూరు దూల్మిట్ట మండలాల నాయి బ్రాహ్మణ కులస్తులతో పాటుగా నాయి బ్రాహ్మణులు, నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం నాయకులు, గౌరవ అధ్యక్షులు అల్లుల స్వామి, ఉపాధ్యక్షులు సింగిరాల శ్రీనివాస్, రాచకొండ మహేందర్, ముఖ్యసలహాదారులు సింగిరాల కనుకయ్య, శ్రావణపల్లి శ్రీనివాస్, కోహెడ మండల అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, దూల్మిట్ట మండలం ప్రధాన కార్యదర్శి కొండూర్ తిరుపతి, కోశాధికారి కొండూరి రవి, మండల నాయకులు సూరంపల్లి రాజు, పందిళ్ళ శ్రీనివాస్, పందిళ్ళ రమేష్, గణేష్ స్వామి యాదగిరి, చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల హామీని వెంటనే భర్తీ చేయాలి

- ములుగు మండల బీజేపీ నాయకులు

నవతెలంగాణ -ములుగు



కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు బూటకపు మాటలు చెప్పి ప్రభుత్వాన్ని ఏర్పరచుకుంది. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఇంతవరకు ఎలాంటి ఉద్యోగం భర్తీ చేయలేదు. బదిలీల ద్వారా ఖాళీలైనా టీచర్ పోస్టులు 15వేలకు పైచిలుకు ఏర్పడడం జరిగింది. ఆ నోటిఫికేషన్ కలిపి పరీక్ష పెట్టాలి. ఏకో ఉపాధ్యాయుల పాఠశాలలను తెరిచి ఖాళీలో ఉన్న ఉద్యోగాలు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలి .ప్రస్తుతం డీఎస్సీ పరీక్ష తేదీలను మార్చేసి నూతన తేదీలను ప్రకటించాలి. గ్రూప్ వన్ ఫిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలి. గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్ లో అదనంగా పోస్టులు పెంచాలి. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33% రిజర్వేషన్ కేటాయించాలి.పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 46 ను వెంటనే రద్దు చేయాలి. జాబ్ క్యాలెండరును వెంటనే విడుదల చేయాలని ములుగు మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల బీజేపీ అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, బీజేవైఎం అధ్యక్షుడు కృష్ణ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బద్రి భాస్కర్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కొండు నర్సింలు, సీనియర్ నాయకులు ఎలంధర్ రెడ్డి, ఇరుకుల ఆనంద్ కుమార్, అరుణ్ రెడ్డి ,మండల కో కన్వీనర్ సతీష్, ఎస్టీ మండల అధ్యక్షుడు కూతాడి అశోక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నవీన్, ప్రవీణ్ గౌడ్, బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ మధు ముదిరాజ్, అన్న సాగర్ గ్రామ బూత్ అధ్యక్షుడు కన్నా రెడ్డి, క్షీరసాగర్ బూత్ అధ్యక్షుడు నల్ల నరేందర్ ములుగు మండలా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలు నేర రహిత సమాజనికి నాంది కావాలి

- న్యాయవాది జే. కిరణ్ కుమార్

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్



భారతీయ నూతన క్రిమినల్ చట్టాలు నేర రహిత సమాజనికి నాంది కావాలని న్యాయవాది జే. కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భారతీయ న్యాయ సంహితలో గల సెక్షన్లపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆడపిల్ల సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ నేరాలు, సామాజిక నేరాల పట్ల అవగాహన కల్గి వుండాలని, ఏమైనా కఠిన పరిస్థితులు ఎదురైతే మహిళలు 181 మహిళా హెల్ప్ లైన్‌ను, పిల్లలు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. భారతీయ న్యాయ సంహితలో వున్న సెక్షన్లు పరంగా కఠినమైన శిక్షలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వ శిక్ష అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ వాసవి, మండల అడ్వకేట్ బాకం సంపత్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ దండబోయిన అన్నపూర్ణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ లు లావణ్య, పద్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

- రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి

నవ తెలంగాణ- రాయపోల్



వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం చిన్న మాసాన్‌పల్లి బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే గతంలో వాహనాల పై ఉన్న పెండింగ్ చలానలు వాహనదారుల నుంచి వసూలు చేయడం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట ఒరిజినల్ పత్రాలు ఉంచుకోవాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్ ఇలాంటి పత్రాలు లేకుండా వాహనాలను నడపరాదని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, కారు వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలియజేశారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని ఇచ్చినట్లయితే వాహన యజమానులకు, తల్లిదండ్రులకు కఠిన శిక్షలు వేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలాగే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొవద్దన్నారు. ధ్రువపత్రాలు లేని పలు వాహనాలకు చలానాలు వేయడం జరిగిందన్నారు. అలాగే వాహనదారులు ఎవరైనా సరే ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణంరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల గ్రామవాసికి డాక్టరేట్

- డాక్టరేట్ అందుకున్న కానుగంటి ప్రభాకర్

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్



ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో "రీసెర్చ్ ఆఫ్ ఎక్స్పరిమెంట్ ఇన్వెస్టిగేషన్ క్యారెక్టర్జషన్ అండ్ బయోలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ కుమారిన్" అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను సిద్దిపేట అర్బన్ మండలం, పొన్నాల గ్రామానికి చెందిన కానుగంటి నారాయణ, కనకవ్వల కుమారుడు ప్రభాకర్ డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. ఈ సందర్భంగా ప్రభాకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని సన్రైజ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ డాక్టర్. దేవేష్ కుమార్ పర్యవేక్షణలో ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభాకర్ హైదరాబాద్ లోని న్యూ ల్యాండ్ లేబరేటరీస్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగంలో సీనియర్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా అతను డాక్టరేట్ పొందడం పట్ల సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అభయ జ్యోతి మనోవికాస విద్యార్థులకు అన్న వితరణ



నవ తెలంగాణ - సిద్దిపేట

వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో అయిత స్వాతి పుట్టినరోజు సందర్భంగా, వారి ఆర్థిక సహాయముతో అభయజ్యోతి మానోవికాస కేంద్రంలోని విద్యార్థులకు అన్న దానం చేసినట్లు జిల్లా కార్యక్రమాల బాధ్యులు మాంకాల నవీన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 25 కిలోల బియ్యాన్ని కూడా అందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా నిరుపేదలకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మర్యాల వాణి, విజయ, కిషన్, వీరేశం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా పై మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సహకార సంఘం అధ్యక్షుడు వంగ చంద్రారెడ్డి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు భరోసా ఎన్ని ఎకరాలకు పరిమితం చేయాలి, పంట బీమా, బోనస్‌ల వంటి అంశాల పైన రైతుల అభిప్రాయాలను సేకరించారు.సమావేశంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి నర్సయ్య, చేర్యాల ఏడిఏ రాధిక, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, ఏఓలు అఫ్రోజ్, నరేష్, సహకార సంఘం డైరెక్టర్లు బాల్ రెడ్డి, మాధవ రెడ్డి, కమలాకర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌ని విజయవంతం చేద్దాం

నవ తెలంగాణ - మిరుదొడ్డి

జులై 28వ తేదీన సిద్దిపేటలో జరిగే ఆఫ్ మారథాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మిరుదొడ్డి ఎస్ఐ బి.పర్శరాములు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిద్దిపేట 2వ ఎడిషన్ ఆఫ్ మారథాన్ గోడపత్రికలను సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు కాసరాజు, ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య, పోలీస్ సిబ్బంది కొమురయ్య, రేష్మా సంధ్య,సాయిబాబా,కరుణాకర్ సంతోష్‌లతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఇట్టి హాఫ్ మారథాన్‌లో 5, 10, 21.2 కిలోమీటర్ల కేటగిరీల్లో పోటీలున్నాయని తెలిపారు.ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకొనివారు ఈ నెల 10వ తేదీ



వరకు పూర్తి చేసుకోవాలని కోరారు.

జాతీయ పురస్కారాన్ని తల్లిదండ్రులకు అంకితం

నవ తెలంగాణ -గజ్వేల్



25 సంవత్సరాల నుంచి చేస్తున్న ఆధ్యాత్మిక కృషి, పట్టుదలకు గాను భక్తిరత్న జాతీయ పురస్కారం పొందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు తన జన్మకు కారణమైన కన్న తల్లిదండ్రులకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ నేను ఉన్నత శిఖరాలకు ఎదిగానంటే దానికి మూల కారణం నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులేనని అన్నారు. ఎన్ని కష్టాలొచ్చిన రామనామాన్ని వదలకు అని ఉపదేశించిన నా మొదటి దైవాలు నా తల్లిదండ్రులే అన్నారు. అందుకే ఈ భక్తిరత్న జాతీయ పురస్కారాన్ని నా తల్లిదండ్రులకే అంకితం అన్నారు. తన కుటుంభ సభ్యులతో భక్తిరత్న వచ్చిన సందర్భంగా ఆనందాన్ని పంచుకున్నారు. ప్రొద్దున లేవగానే నా తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి పనులు ప్రారంభిస్తానని తల్లిదండ్రుల ఆశీస్సులు ఉంటే ప్రపంచంలో సాధించనిది ఏది లేదన్నాడు. కనిపించే దైవాలు తల్లిదండ్రులే అన్నారు.

హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- మండల విద్యాశాఖ అధికారి నర్సమ్మ

నవతెలంగాణ -రాయపోల్



రాయపోల్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో హెడ్ కుక్ పోస్టు ఖాళీగా ఉన్నది. అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి నర్సమ్మ కోరారు. రాయపోల్ కేజీబీవీ పాఠశాల హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి తాత్కాలిక ప్రతిపాదికన పనిచేసేందుకు స్థానికులైన మహిళలు ఏడవ తరగతి చదివిన వారై, 300 మందికి వంట చేయగల సామర్థ్యం గల అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ పోస్టుగాను రాయపోల్ మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో ఈ నెల 03వ తేదీ నుంచి 11 వ తేదీలోపు ఉదయం 10:00 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు పాస్ ఫోటో, ఆధార్ కార్డ్, అనుభవం గల ధ్రువీకరణ పత్రాలు జతపరిచి కేజీబీవీ పాఠశాల యందు దరఖాస్తు చేసుకోగలరని పేర్కొన్నారు. తదనంతరం ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేదని అందుకోసమే అర్హులైన అభ్యర్థుల కోసం మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

మృతుని కూతురు చదువు కోసం ఆర్థిక సహాయం

- స్ఫూర్తి ఫౌండేషన్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం ముస్త్యాల గ్రామం పేదకుటుంబానికి చెందిన మేరిండ్ల శ్రీనివాస్ గౌడ్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని స్ఫూర్తి ఫౌండేషన్ అండ్ కౌండిన్య ఫౌండేషన్ వారికి తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వీ.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు చేసిన విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌లో బీబీఏ సెకండ్ ఇయర్ చదువుచున్న శ్రీనివాస్ గౌడ్ పెద్ద కుమార్తె రిషిత కళాశాల ఫీజుతోపాటు హాస్టల్ ఫీజు రూ. 1లక్ష 2 వేల 500 లను చెల్లించినట్లు కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్ మంగళవారం తెలిపారు.ఆర్థిక సహాయం అందజేసిన స్ఫూర్తి అండ్ కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఫౌండేషన్స్ రీప్రజెంటివ్ పాలగోని విష్ణుధర్మాకు గీత సంఘం రాష్ట్ర, సిద్దిపేట జిల్లా కమిటీలు, మృతుని కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక వేలం పాటకు భారి నజరాన

నవతెలంగాణ -నంగునూరు

అక్రమంగా డంప్ చేసిన ఇసుకను మంగళవారం వేలం పాట నిర్వహించగా రూ.3 లక్షల 57 వేల 102 లు వచ్చాయని తహసీల్దార్ జి.సరిత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లింగం తెలిపారు. నంగునూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొందరు వ్యక్తులు అక్కెనపల్లి పెద్ద వాగు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేసి డంప్ చేయగా రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి గుర్తించిన విషయం తెలిసిందే. దాదాపు 190 ట్రిప్పుల ఇసుకను 19 మంది వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకుని వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు.వేలం పాటలో పాల్గొన్న వారు 50 శాతం ముందే చెల్లించారన్నారు. మిగతా 50 శాతం చెల్లించగానే ట్రెజరీలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఇసుకను డంప్ చేసినవారే వేలం పాటలో పాల్గొన్నట్లు సమాచారం